- నేటి నుంచి గ్రామాల్లో వైద్య శిబిరాలు
- ఉచితంగా పరీక్షలు, టీకాలు, శస్త్రచికిత్సలు
- పశుసంవర్ధకశాఖ నేతృత్వంలో 31 వరకు నిర్వహణ
- పెంపకందారులు వినియోగించుకోవాలని సూచన



పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో జిల్లా పశుసంవర్ధక అధికారి నరసింహారావు,డాక్టర్ శివయ్య తదితరులు



పశు వైద్యానికి.. పెద్దపీట

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం.. పాడి పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే మినీ గోకులాల నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. గోకులాలను పశువుల పెంపకందారులకు 90 శాతం రాయితీపై నిర్మిస్తోంది. గేదెలు, గొర్రెలు, మేకల పెం పకానికి ఊతం ఇస్తోంది. పాడి రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా చేపట్టింది. పశు పెం పకందారులకు, పశు పోషకులకు మేలు చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పశు వుల వైద్యానికి కూటమి ప్రభు త్వం పెద్దపీట వేస్తోంది. పశువులను వైద్యశాలలకు తీసుకు వచ్చేందుకు ఎన్నో వ్యయప్రయాసలకు గురవు తున్నారు. ఈ పరిస్థితుల్లో పశువులను వైద్యశా లలకు తీసుకురావాల్సిన అవసరం లేకుండానే వైద్య సేవలను వారి ముంగిట్లో అందుబాటు లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో పశు ఆరోగ్య శిబిరాలను అన్ని గ్రా మాల్లో నిర్వహించనున్నారు. ఇందుకు పశుసం వర్ధక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సోమవారం నుంచి వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 31 వరకు వైద్య శిబిరాలను నిర్వహిస్తారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది బృందాలుగా ఏర్పడి సహాయ సంచాలకులు, పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకుల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి బృందంలో వెట ర్నరీ అసిస్టెంట్ సర్జన్, సిబ్బంది ఈ బృందంలో ఉంటారు. ప్రతి మండలంలో రోజుకు రెండు నుంచి మూడు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నారు. వైద్య శిబిరాలను పెంపకందారులు వినియోగించు కోవాలని అధికారులు కోరారు.

టీకాలు కూడా ఉచితంగానే..

వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులు, టీకాలు, శస్త్ర చికిత్సల సేవ లను ఆయా శిబిరాల్లో ఉచితంగా అంది స్తారు. ప్రతి ఒక్క గ్రామంలో అన్ని పశు వులు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, చిన్నదూడలకు వైద్యం అందిస్తారు. వైద్య శిబిరాలను పశు పోషకులు, పెంపకందా రులు సద్వినియోగం చేసుకునేలా గ్రా మాల వారీగా పశుసంవర్ధకశాఖ సి బ్బంది ప్రచారం నిర్వహిస్తోంది. పశు వులను వైద్యులచే పరీక్షించి ఉచితంగా వైద్యంతో తేలికపాటి శస్త్రచికిత్సలు అక్కడికక్కడే చేసేలా ఏర్పాట్లు చేస్తు న్నారు. శిబిరాల్లో అన్ని రకాల గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి తగువైద్యం అందించనున్నారు. పశువు లు, చిన్న దూడలు, సన్నజీవాలకు (గొర్రెలు, మేకలకు) నట్టల నివారణ మందు ఉచితంగా తాగిస్తారు. పశు ఆరోగ్య సంరక్షణలో భాగంగా అన్ని గ్రా మాల్లో సామూహికంగా పశువులకు (ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు) వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేస్తారు.

స్లీపర్ బోగీలూ.. కిటకిటే

కాలు తీసి కాలు పెట్టేందుకు వీలుండదు.. స్టేషన్ వచ్చి దిగే ప్రయాణికులు, ఎక్కే ప్రయాణికుల పోరాటాలు.. ఇదీ జనరల్ బోగీల్లో కనిపించే దృశ్యాలు. ప్రయాణికులు రైలు ఎక్కలేక ప్రయాణాల్ని విరమించుకో వడం.. గమ్యస్థానంలో దిగలేక పోవడం ప్రయాణికులకు పరిపాటిగా మారుతోంది. ఇలాంటి ఇబ్బందులు లేకుండా భారమైనా పలువురు రిజర్వేషన్లు చేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు. అయితే జనరల్ బోగీల్లోకంటే దారు ణంగా రిజర్వుడు బోగీల్లో పరిస్థితి నెలకొందంటే ఆశ్చర్యం కాదు. కరోనా తర్వాత నుంచి ప్రయాణి కులకు రైలు ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. అయినా రైల్వే అధికారుల తమకు సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- జనరల్ బోగీల కంటే పరిస్థితి ఘోరం
- రిజర్వేషన్ టిక్కెట్ లేకుండానే ప్రయాణికుల ప్రవేశం
- టాయ్‌లెట్లకూ వెళ్లలేకపోతున్న రిజర్వుడ్ ప్రయాణికులు

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దూర ప్రాంతాల నుంచి గుంటూరు మీదగా రాకపోకలు సాగించే రైళ్లలో స్లీపర్‌క్లాస్ కోచ్‌లు జనరల్ బోగీల కంటే ఘోరంగా ఉంటున్నాయి. రిజర్వుడ్ బోగీల్లోకి ఎవరంటే వారు ఎక్కేస్తున్నారు. ఫుట్‌బోర్డులు, టాయ్‌లెట్స్, కోచ్ మధ్యలో ఉండే దారి, కంపార్టు మెంట్లలో ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ కూర్చుంటూ రిజర్వుడ్ ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు, షుగర్ వ్యాధిగ్ర స్తులు, పిల్లలు అత్యవసరమై కనీసం టాయ్‌లెట్స్‌కు కూడా వెళ్లలేని పరిస్థితి స్లీపర్‌క్లాస్ బోగీల్లో నెలకొంటున్నది. జనరల్ బోగీల్లో ఎక్కలేని వారంతా సమీపంలోని రిజర్వుడు బోగీలను ఆశ్రయిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లను, బోగీలను పెంచాల్సిన రైల్వే ఆ విషయాన్ని మరిచింది. గుంటూరు మీదగా ఒడిస్సా బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల నుంచి ఎక్కు వ మంది విశాఖ, ఫలక్‌నుమా, షాలిమార్, వాస్కో డిగామా, సిల్చార్, ప్రశాంతి, శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, శబరి, అమరావతి, బెంగళూరు, హుబ్లీ, తిరువనంతపురం వైపు వెళ్లే రైళ్లలో అత్యధికంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు ప్రయాణిస్తుంటారు. గతంలో రిజర్వుడ్ బోగీల్లో కేవలం కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్ ప్రయాణికులు మాత్రమే ఎక్కేవారు. వెయిటింగ్ లిస్టు టిక్కెట్ ఉన్న వారికి ఎక్కడైనా ఖాళీలుంటే టీటీఈలు సీట్లు కేటాయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి ఏ ఒక్క రైలులోనూ కనిపించడం లేదు. పండుగ సెలవుల రద్దీ సీజన్‌లోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ రిజర్వుడు బోగీలు కూడా కిటకిటలాడు



స్లీపర్ క్లాస్ బోగీలో పరిస్థితి

తున్నాయి. స్లీపర్‌క్లాస్‌లో టిక్కెట్లు బుకింగ్ చేసుకోవడానికి భయపడిపోతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ప్రయాణికుల బాధ వర్ణనాతీతం

అనధికార వ్యక్తులు స్లీపర్‌క్లాస్‌లో చేరడంతో సౌకర్యాలు, భద్రతపరంగా ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు మొర పెట్టుకుంటున్నా అటు ఆర్‌పీఎఫ్ ఇటు రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు ఆలకించడం లేదు. ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే ప్ర యాణికుల్లో ఎక్కువ మంది గుట్కా, జర్దా నములుతుంటారు. వారు అలానే బోగీల్లో ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేస్తూ ఇతరులకు నరకం చూపిస్తున్నారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే వారంతా ఒక్కటై తిరగబడుతున్నారు. ప్రయాణికులు ట్విట్టర్, ఇతర కంప్లయింట్ నంబర్లకు నివేదించినా ఫలితం శూన్యం.

క్రమక్రమంగా స్లీపర్‌క్లాస్‌ల కనుమరుగు

రైళ్లలో మధ్యతరగతి వర్గాల ప్రజలకు క్రమక్రమంగా స్లీపర్‌క్లాస్ బోగీలు కనుమరుగు అవుతు న్నాయి. గతంలో ఒక్కో రైలుకు కనీసం 12 నుంచి 14 స్లీపర్‌క్లాస్‌లు ఉండేవి. ఇప్పుడు కొన్ని రైళ్లు మినహా అన్నింటిలో మూడు, నాలు గుకు కుదించేశారు. వాటి స్థానంలో త్రీటైర్, టూటైర్, త్రీఏ ఎకానమి బోగీలను తీసుకొచ్చి ప్రయాణికులపై మూడింతల భారాన్ని మోపుతున్నారు. ఇటీవల కాలంలో ఏసీ త్రీటైర్‌లోనూ అనధికార వ్యక్తులు ప్రవేశిస్తున్న సంఘటనలు భయపడుతున్నాయి.

ప్రమాదం జరిగితే అంతే సంగతులు...

ఇటీవల కాలంలో ఒడిస్సా, బెంగాల్ రాష్ట్రాల్లో రైళ్ల ప్రమాదాలు జరిగినప్పుడు భారీగా ప్రాణనష్టం సంభవించింది. అందుకు అనధికార వ్యక్తులు ఎక్కువ సంఖ్యలో స్లీపర్‌క్లాస్‌లలో ఉండటం కూడా ఒక కారణం. కాగా ఏదైనా ప్రమాదం జరిగితే రిజర్వుడ్ ప్రయాణికులను సులభతరంగా గుర్తించవచ్చు. ఇందుకు కార ణం వారి పేర్లు, ఫోన్ నంబరు రైల్వే వద్ద నమోదై ఉంటుంది. టీటీఈలు ఈఎఫ్‌టీలు రాస్తున్న అనధికార వ్యక్తులకు సంబం ధించి ఎలాంటి సమాచారం అందుబాటులో ఉండదు. అప్పుడు వారి కుటుంబాలకు క్లెయిమ్‌లు చేయాలన్నా కుదరని పరిస్థితి. భద్రత విషయంలో కఠినంగా ఉండాలని రైల్వే జీఎం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు.

టార్గెట్లతోనే తంటా..

కేవలం కన్‌ఫర్మ్‌డ్ టిక్కెట్లు కలిగిన ప్రయాణికులను మాత్రమే అనుమతించాల్సిన బోగీల్లోకి ఎవరిని పడితే వారిని ట్రావెలింగ్ టిక్కెట్ ఎగ్జామినర్(టీటీఈ)లు ఎక్కించేస్తున్నారు. వారికి కేటాయిం చిన పెనాల్టీల లక్ష్యాన్ని అధిగమించడానికి దీనిని అవకాశంగా చేసుకుం టున్నారు. కొన్ని రైల్వేస్టేషన్లలో అయితే టీటీఈలు ప్లాట్‌పాం నిలబడి వారే పెనాల్టీ కట్టించుకుని లోపలికి వెళ్లి ఎక్కడో ఒక చోట కూర్చోమని సలహా ఇస్తున్నారు. ప్రతీ టీటీఈ/స్క్వాడ్ రోజు/నెలకు ఇంత మొత్తం పెనాల్టీ రూపంలో వసూలు చేయాలని రైల్వే కమర్షి యల్ విభాగం అధికారులు టార్గెట్లు పెడుతున్నారు. వాటిని చేరుకో కపోతే మందలింపులు ఎదుర్కోవాల్సి వస్తుండటంతో స్క్వాడ్/టీటీఈలు సులభంగా ఉండే ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. టిక్కెట్ లేకుండా ఎక్కినా ఫైన్ రాసి ఇస్తున్నారు. ఒక్కో టీటీఈ రో జుకు రూ.25 వేలకు పైగా ఇలా ఫైన్ల రూ పంలో వసూలు చేస్తున్నారు.

30 నుంచి రీసర్వే

- పునః ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి
- సభలు, ర్యాలీలతో ప్రజల్లో అవగాహన
- 25 నుంచి కార్యక్రమాలకు అధికారులు సిద్ధం
- వైసీపీ హయాంలో తూతూమంత్రం.. తప్పులేతప్పులు
- ఈసారి పొరపాట్లకు తావులేకుండా యజమాని, గ్రామస్థుల సమక్షంలో కొలతలు



గ్రామ హద్దుల సర్వేను పరిశీలిస్తున్న సర్వే శాఖ ఏడీ కీర్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

హద్దులు మారిపోయాయి.. విస్తీర్ణం తగ్గిపోయింది.. వివరాల్లో తప్పులు.. ఇలా గత వైసీపీ హయాంలో భూముల సర్వే జరిగింది. వివాదాలు తగ్గించేందుకు అని చెప్పి చేపట్టిన సర్వే సరికొత్త సమస్యలను తీసుకొచ్చింది. సర్వే బాధితులు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగినా అప్పట్లో కనికరించలేదు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించాలని.. గత సర్వేలో చోటుచేసుకున్న తప్పులను సవరించాలని నిర్ణయిం చింది. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీ నుంచి రీ సర్వేకు సిద్ధమైంది. భూముల సమస్యల పరిష్కారా నికి శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో భూ రీసర్వేను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహణకు అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. గ్రామ హద్దుల నిర్ధారణకు సంబంధిం చిన సర్వే జరుగుతోంది. భూముల యజమానులకు సర్వేపై అవగాహన కల్పించేందుకు 25వ తేదీ నుంచి 27 వరకు గ్రామ సభ లు.. ర్యాలీలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబం ధించి ప్రణాళికను సర్వే శాఖ సిద్ధం చేసింది. మండ లానికి ఒక గ్రామాన్ని రీసర్వేకు ఎంపిక చేశారు. ఇందు కోసం యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

వైసీపీ హయాంలో గందరగోళం

వైసీపీ హయాంలో భూముల రీసర్వే అస్తవ్యస్తంగా.. గందరగోళంగా జరి గింది. పెద్దఎత్తున తప్పులు చోటు చేసుకున్నాయి. ఒక్కో మండలంలో ఒకేసారి ఐదారు రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేశారు. అధికారులు సిబ్బంది కొరతతో తూతూమం త్రంగా సర్వేచేయగా తప్పులు చోటుచేసుకున్నాయి. సర్వేలో వ్యత్యాసం ఉంటే యజమానిని సంప్రదించ కుండా ఒకరికి ఎక్కువ ఒకరికి తక్కువగా భూమి ఎక్కిం చారు. ఫలితంగా ఎన్నడూ లేనంతగా భూ సమస్య లను రైతులు ఎదుర్కొ న్నా రు. కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి వేలాది మంది బాధితులు అర్జీలు అందజేశారు. ఈ పరిస్థితుల్లో గతం లో జరిగినట్లు పొరపాట్లుకు తావులేకుండా, అత్యంత జాగ్రత్తగా రీసర్వే నిర్వహించాలని యంత్రాంగాన్ని కూట మి ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రీ సర్వేలో ఎటు వంటి లోపాలు తలెత్తకుండా పక్కా ప్రణాళికను అధికారులు సిద్ధం చేశారు. ఒక్కొక్క మం డలంలో ఒక్కో గ్రామంలోనే రీ సర్వే చేయనున్నారు. రీసర్వేకు ప్రత్యేకంగా బృందాలను కూడా నియమించారు. 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా వి భజించగా ఒక్కో బ్లాక్‌కు ఒక బృందాన్ని కేటా యించారు. ఈ బృందంలో ఇద్దరు సర్వేయర్లు, గ్రా మ రెవెన్యూ అధికారి, గ్రామ సహా యకులు ఉంటారు. బృందానికి సాంకేతిక సిబ్బంది సహాయంగా ఉంటారు. పొలాల గట్లు, విస్తీర్ణం పక్కాగా కొలుస్తారు. ఎక్కడికక్కడ ప్రజలు, భూ యాజమానుల సమక్షంలోనే సర్వే చేయనున్నారు. ఇప్పటికే గ్రామ సరిహద్దులపై సర్వేశాఖ అధికారులు గుర్తిస్తున్నారు.

-మెయిన్‌లో

గుంటూరులో కొకైన్ కలకలం

◆ రాష్ట్రంలోనే తొలిగా గుర్తింపు.. కేసు ◆ ముగ్గురు అరెస్టు.. 8.5 గ్రాములు స్వాధీనం

రెండేళ్ళ చిన్నారి సహా గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య

◆ బుడంపాడు సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఘటన

సీఏ విద్యార్థి ఆత్మహత్య

6



జులై 1న పాముల నాయక్ ఇంటికి వెళ్లి హామీ పత్రం ఇస్తున్న చంద్రబాబు

చంద్రబాబు హామీ అమలు

గుడిసె నుంచి డాబాలోకి పాములనాయక్

● సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు ● రిపబ్లిక్‌డే హౌసింగ్ శకటంలో పాములనాయక్ ఇంటి నమూనా



పాముల నాయక్‌కు నిర్మించిన నూతన భవనం

తాడేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లను నేరుగా లబ్ధిదారులను కలిసి ఇచ్చే క్రమంలో గ్రామానికి వచ్చి ఓ నిరుపేద కుటుంబ దయనీయస్థితికి ముఖ్యమంత్రి చంద్రబాబు చలించి ఇల్లు నిర్మాణానికి హామీ ఇచ్చారు. అక్కడికక్కడ వారికి ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీఎం ఆదేశించగా.. ఆరు నెలల్లో ఆ కుటుంబం పూరి గుడిసె నుంచి డాబా ఇంట్లోకి చేరింది. గత ఏడాది జూలై 1న పింఛన్ల పంపిణీకి తాడేపల్లి మండలం పెనుమాక గ్రామాన్ని ఎంపిక చేశారు. గ్రామానికి వచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు స్థానిక ఎస్సీ కాలనీలోని పాముల నాయక్ కుటుంబం పూరిపాకలో ఉండటాన్ని గమనించారు. వెంటనే ఆ ఇంట్లోకి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆ ఇంటి పెద్ద పాములనాయక్ కూలిపనులకు వెళుతుండగా, ఆయన భార్య సీత పండ్లు విక్రయిస్తూ ఉంటారు. భర్త చనిపోయిన వారి కుమార్తె సాయి తల్లిదండ్రుల ఉంటూ తల్లికి సహకరిస్తూ ఉంటుంది. ఈమెకు ఇద్దరు కుమారులు కాగా ఒకరు ఇంటర్ మరొకరు 9వ తరగతి చదువుతున్నారు. పాములనాయక్ పెద్ద కుమార్తె చనిపోగా మానసిక స్థితి సరిగ్గా లేని ఆమె కుమార్తె శివమ్మ కూడా వీరితోనే ఉంటుంది. పూరిపాకలో నివసించే నాయక్ కుటుంబ వివరాలు తెలుసుకున్న చంద్రబాబు చలించిపోయారు. వెంటనే అధికారులను పిలిచి హౌసింగ్ స్కీమ్ కింద గృహాన్ని నిర్మించాలని ఆదేశించారు. సాయి కుమారులకు చదువు పూర్తిగానే ఉద్యోగం ఇప్పిస్తానని, పెద్దకుమార్తె కూతురుకు పింఛన్ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు హామీ ప్రకారం ఆరు నెలల్లో పాములనాయక్ కుటుంబానికి అధికారులు రెండు గదులు, వంటగది, హాలు, వరండాతో భవనాన్ని నిర్మించారు. వచ్చే నెలలో గృహప్రవేశానికి ముహూర్తం నిర్ణయించారు. కాగా మోడల్ హౌస్‌గా నిర్మించిన ఈ ఇంటిని రిపబ్లిక్ డే రోజున హౌసింగ్ శాఖ తమ శకటంలో ప్రదర్శనకు అంగీకరించినట్టు తెలిసింది. మాట తప్పకుండా చంద్రబాబు, లోకేశ్‌లు తమకు మంచి గృహాన్ని నిర్మించడంతో పాముల నాయక్ కుటుంబం వారికి కృతజ్ఞతలు తెలిపింది. ఇంటినిర్మాణ పర్యవేక్షణను హౌసింగ్ అధికారులు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, మైనార్టీ సెల్ నేత పఠాన్ జానీఖాన్‌లు చూశారు.

వర్షానికి తడిస్తూ ఇబ్బందులు పడ్డాం..



పూరిపాకలో వర్షానికి తడుస్తూ తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వర్షపు నీటిని నిలువరించేందుకు ఇంట్లో బొచ్చెలు, గిన్నెలు పెట్టుకుని తంటాలు పడ్డాం. మా కష్టాన్ని చంద్రబాబునాయుడు లోకేశ్‌లు గుర్తించారు. గుడిసె నుంచి డాబాలోకి వచ్చాం. వారు వేయి కాలాలపాటు చల్లగా ఉండాలి.

- పాములు నాయక్

పిల్లలకు ఉద్యోగం ఇస్తామన్నారు..



భర్త ఏడేళ్ల క్రితం చనిపోయాడు. తల్లితో కలిసి పండ్లు విక్రయిస్తూ ఇద్దరు పిల్లలను పోషిస్తున్నాను. పిల్లలకు ఉద్యోగం ఇప్పిస్తానని, బాగా చదువుకోమని చంద్రబాబు చెప్పారు. ఆ మాటలతో పిల్లలు బాగా చదువుకుంటున్నారు.

- పాములునాయక్ కుమార్తె సాయి

గ్రామస్థుల హర్షం



సీఎం చంద్రబాబు, యువనేత లోకేశ్ చొరవతో పాము లునాయక్ కుటుంబానికి గూడు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాట తప్పమంటూ... పాములునా యక్ కుటుంబానికి ఆరు నెలల్లోనే మంచి డాబా ఏర్పాటు చేశారు. టీడీపీ హయాంలోనే పేదలకు మేలు జరుగుతుందని చంద్రబాబు, లోకేశ్‌లు రుజువు చేశారు. - కొల్లి శేషు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి



టైల్స్, గ్రానైట్‌తో కూడిన వంటగది

రైల్వే ప్రాజెక్టు కోసం భూముల సమీకరణకు రైతుల వినతి



మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసిన రైల్వేలైన్ బాధిత రైతులు

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) నూతనంగా రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం నిర్మించనున్న రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం నిర్ధా రించిన భూములను భూ సమీకరణ ద్వారా తీసుకోవాలని కేంద్ర గ్రామీ ణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు పలు గ్రామాల రైతులు విన్నవించుకున్నారు. తెలంగాణాలోని ఖమ్మం సమీపంలో ఉన్న ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు సుమారు 57 కిలో మీటర్ల మేరకు నిర్మించే రైల్వేలైనుకు భూమిని సేకరించాల్సి ఉంది. కృష్ణానదికి దక్షిణ వైపున ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వైకుంఠపురం నుంచి నంబూరు వరకు అమరావతి, తాడికొండ మండలాలలోని పలు గ్రామాల మీదుగా ఇందుకు సంబంధించి 527 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. సీడ్ క్యాపిటల్ పరిధిలోని తాడికొండ మండలంలో కొప్పురావూరు, పెద కాకాని, తాడికొండ, మోతడక, కంతేరు, పెదపరిమి, వడ్లమాను గ్రామాల రెవెన్యూ పరిధిలో 199 ఎకరాలు, పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల రెవెన్యూ పరిధిలో 330 ఎకరాలు ఈ రైల్వే లైనుకు అవసరమని గుర్తించి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి సంబంధిత రైతుల అభిప్రాయాలను కోరింది. సీడ్‌క్యాపిటల్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులు తమ భూమిని భూ సేకరణ ద్వారా కాకుండా సమీకరణ ద్వారా తీసుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కొందరు రైతులు కలిశారు. ఈ విషయాన్ని ప్రభు త్వం దృష్టికి తీసుకువెళ్లి, సానుకూలంగా స్పందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. భూసమీకర ణపై పూర్తి అవగాహన కలిగిన కొందరు రైతులు మళ్లీ వచ్చి కలిస్తే పరిశీలించి, సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసు కెళ్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు.

ఆవుల మందపై పెద్దపులి దాడి

రెంటచింతల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మకోట గ్రామ సమీపంలోని అడవిలో పెద్దపులి సంచరిస్తుండడంతో పశువుల కాపరులు భీతావహులయ్యారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఆవులను తీసుకుని అడవిలోకి వెళ్తున్న సమయంలో కందినాగమ్మకుంట పైభాగంలో నెమలిశెల వద్ద పెద్దపులి ఆవుల మందపై దాడి చేసింది. గోవులు పులి బారినుంచి తప్పించుకోగా, ఆవు దూడ మాత్రం పులి నోట చిక్కింది. పులి దాడితో పశువుల కాపరి బాలునాయక్ గ్రామంలోకి వెళ్లి ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలిపారు. మండలంలో పెద్దపులి సంచరించడం.. దాడి చేయడం ఇదే మొదటిసారి. పులి సంచారం విషయాన్ని తుమ్మకోట వీఆర్వో నరసింహారావు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ విజయనిర్మల, సెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లారు. చీకటి పడడంతో సోమవారం పులి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించడంతోపాటు పాదముద్రలు సేకరించి, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామని బీట్ ఆఫీసర్ చెప్పారు.

సీఏ విద్యార్థి ఆత్మహత్య

- బ్రాడీపేటలోని లోటస్ బాలుర వసతి గృహంలో ఘటన
- మృతుడు నెల్లూరు జిల్లా గూడూరు వాసి



మృతుడు శివప్రసాద్

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 4/11లో ఉన్న లోటస్ బాలుర వసతి గృహంలో సీఏ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన కె నాగ శివప్రసాద్ (24) అనే విద్యార్థి తాను ఉంటున్న హాస్టల్ గదిలో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మహిళా ఎస్సై రోజాలత కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శివప్రసాద్ తండ్రి ప్రభాకర రాజు గూడూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శివప్రసాద్ ప్రస్తుతం బ్రాడీపేటలోని నాగార్జున సీఏ అకాడమిలో సీఏ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని నెలల్లో కోర్సు పూర్తి కాబోతోంది. ఇదిలాఉంటే శివప్రసాద్ సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి నాలుగు రోజుల క్రితమే హాస్టల్‌కు వచ్చాడు. హాస్టల్ గదిలో తన క్లాస్‌మేట్ వేణుగోపాల్‌తో కలసి శివప్రసాద్ ఉంటున్నాడు. శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో వేణుగోపాల్ స్టడీ అవర్‌కు వెళ్ళి ఆ తర్వాత తిరిగి వచ్చాడు. ఎంత కొట్టినా రూమ్ తలుపు తీయలేదు.లోపల గడియపెట్టి ఉండటంతో శివప్రసాద్ నిద్ర పోతున్నాడేమోనని భావించాడు. దీంతో, పక్క గదిలోకి వెళ్లి అతను పడు కున్నాడు. ఉదయం మరోసారి గది తలుపు తట్టినా తీయక పోవడంతో హాస్టల్ నిర్వాహకు లకు ఫిర్యాదు చేసి క్లాసుకు వెళ్ళాడు. హాస్టల్ నిర్వాహకులు తలుపు కొట్టినా తీయ లేదు. అనుమానం వచ్చి కిటికీ తలుపు పగలకొట్టి చూడగా ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కని పించాడు. వెంటనే వారు పోలీ సులకు సమాచారం ఇచ్చారు. మహిళా ఎస్సై రోజాలత ఘటనా స్థలికి వెళ్లారు. తలుపులు పగలగొట్టి చూడగా అప్పటికే శివప్రసాద్ మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. శివప్రసాద్ గదిలోనూ, క్లాస్‌లోనూ ఎవరితోనూ కలవడని, ఎప్పుడూ ముభావంగా ఉంటాడని రూమ్ మేట్ చెప్పాడు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ మేరకు విద్యార్థి తల్లిదండ్రులకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు ఇక్కడికి చేరుకున్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ శివప్రసాద్‌కు కొన్ని సబ్జెక్టులు మిగిలి ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.



ప్రసంగిస్తున్న జలవనరుల ప్రాజెక్టుల అధ్యయనకారుడు లక్ష్మీనారాయణ, పక్కన లక్ష్మణరెడ్డి

నిర్మాణంలోని ప్రాజెక్టులను పూర్తి చేయండి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జలవనరుల ప్రాజెక్టుల అధ్యయనకారుడు, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ తెలిపారు. చైతన్య వేదిక ఆధ్వర్యంలో గుంటూరులో 'ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల ప్రాజెక్టులు - ప్రస్తుత పరిస్థితి' అనే అంశంపై ఆదివారం జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాయలసీమలోని హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ, ప్రకాశం జిల్లాలోని వెలుగొండ, ఉత్తరాంధ్రలోని వంశధార రెండో దశ, తోట పల్లి బ్యారేజి, వంశధార నాగవల్లి అనుసంధాన పథకం, ఉత్తరాంధ్ర సృజల స్రవంతి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను కేటాయించాలన్నారు. గోదావరి బనకచర్ల అనుసంధాన పథకంపై విస్తృత చర్చ నిర్వహించాలని సూచించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భారంగా మారకూడదన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రూ.90 వేల కోట్లతో గోదావరి బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలనుకోవడం సబబు కాదన్నారు. దీనికి బదులు రూ.20 వేల కోట్లతో ఉత్తరాంధ్ర, రాయలసీమలో కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. ఉత్తరాంధ్ర చెరువుల పరి రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిసర్ల కృష్ణమూర్తినాయుడు ప్రసం గిస్తూ కేవలం రూ.3,000 కోట్లు ఖర్చు చేస్తే ఉత్తరాంధ్రలో నీటిపారుదల ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయన్నారు. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపా ధ్యక్షుడు వై.కేశవరావు ప్రసంగిస్తూ గత ఐదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టుల కేటాయింపులలో 52 శాతం మాత్రమే ఖర్చు చేశారన్నారు. కూటమి ప్రభు త్వం బడ్జెట్లో రూ. 15 వేల కోట్ల కేటాయిం చినా కోటి కూడా విడుదల చేయ లేదని అన్నారు. అనం తరం ప్రొఫెసర్ డీఏ ఆర్ సుబ్రహ్మణ్యం, ఉమ్మడి గుం టూరు జిల్లా సర్పం చుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాస రావు, హైకోర్టు అడ్వకేట్ ఎన్.శ్రీనివాసరావు, ఆంధ్ర ప్రదేశ్ గెజి టెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు ఏవీ పటేల్, నేస్తం సహ వ్యవ స్థాప కుడు టి. ధనుంజయరెడ్డి, వంశధార సాధన సమితి ప్రెసిడెంట్ ఎస్వీవీ ప్రసాద రావు ప్రసంగించారు.

క్రీ.శ.1359 నాటి శాసనం గుర్తింపు



శిలాశాసనాన్ని చూపుతున్న సతీష్‌బాబు

మాచర్లటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలంలోని మండాది గ్రామంలో క్రీ.శ. 1359 నాటి శాసనాన్ని గుర్తించినట్లు మాచర్ల పట్టణానికి చెందిన చరిత్ర పరిశోధకుడు, రచయిత పావులూరి సతీష్ తెలిపారు. మండాదిలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఆలయం వద్ద రోడ్డు పక్కన పిచ్చి కంపల మధ్య శిథిలావస్థలో ఉన్న శిలాశాసనాన్ని ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు మాట్లాడుతూ ఈ శిలాశాసనం క్రీ.శ. 1359 నాటిదని, భారత పురావస్తు శాఖ 1930లో ఈ శాసనం నకలు తీశారన్నారు. ఈ శాసనంలో గ్రామంలోని మల్లికార్జునస్వామి సేవలు, వైభవాలకు తంగెడ మాచలనాయుడు కుమారుడు సిరిగిరినాయుడు గ్రామాన్ని దత్తత ఇచ్చారని, ఆలయ కంభం మరమ్మతులకు గరైతే నూతన కంభం ఎత్తించాడని శాసనంలో ఉన్నట్లు చెప్పారు. ఈ శాసన బండ పక్కనే మరో చిన్న శిథిలశాసనం ఉందని, ఈ శాసనంలోని అక్షరాలు పూర్తిగా శిథిలమై చెరిగిపోయాయన్నారు. వారసత్వ సంపదను కాపాడుకోవాలని, శిథిలమవుతున్న శాసనాలను దేవాలయాల్లోకి మార్చి రక్షణ కల్పించాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142,151,162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

రెండేళ్ళ చిన్నారితో గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య



గుంటూరు, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి) : బుడంపాడు జాతీయ రహదారి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి రెండేళ్ళ చిన్నా రితో సహా గుర్తు తెలియని మహిళ ఆత్మ హత్య చేసు కుంది. ఈ నెల 18న అర్ధరాత్రి సమ యంలో సుమారు 30 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తుతెలియని మహిళ, సుమారు రెండేళ్ల వయసు కలిగిన పాపతో విజయవాడ నుంచి చెన్నై వెళ్లే నేషనల్ హైవే సమీపంలో బుడంపాడు బ్రిడ్జి కింద రైల్వే ట్రాక్‌పై ఈ ఘటన జరిగింది. గుంటూరు రైల్వే పోలీ సుల కథనం మేరకు, చనిపోయిన మహిళ లైట్ గ్రీన్ కలర్ టాప్, వంకాయరంగు ప్యాంటు గల పంజాబీ డ్రెస్ ధరించి ఉంది. పాప సిమెంటు రంగు టీ షర్టు ధరించి ఉంది. సమీపంలో పడి ఉన్న చిన్న బ్యాగ్‌లో దుప్పటి ఉంది. తల్లీకూతుళ్ల మృతదేహాలను మార్చురీలో భద్ర పరిచినట్లు సీఐ లక్ష్మీనారాయణరెడి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తనను 8328018787 నంబరులో గాని, జీఆర్‌పీ పోలీస్ స్టేష న్‌కు 0863-222073 నంబరులో గానీ తెలియజేయాలని తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



చాట్ల బాలు

తాడేపల్లి, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): ఉండవల్లిలోని ఎత్తిపోతల పథ కం వద్ద కృష్ణానదిలో ఆదివారం సాయం త్రం ఈతకు దిగిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి చెందాడు. యువకుడు విజయవాడకు చెందిన చాట్ల బాలు (18)గా పోలీసులు గుర్తించారు. తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహం గాలింపు చర్యలు సోమ వారం చేపడతామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

తెనాలి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానికి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ మోర్ల శ్రీనివాసరావు (45) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని నాజరుపేటలో ఉంటున్న ఆయన తెల్లవారుజామున గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తీసుకు వెళ్లేలోగామృతి చెందారు. 1995లో పోలీసు శాఖలో ప్రవేశించిన ఆయన కొంతకాలంగా గుంటూరు ఏఆర్ పోలీసుల ఎస్కార్ట్ డ్యూటీలో ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని సం దర్శించిన సీఐ రాంనాయక్, ఎస్ఐ బాబురావు నివాళులర్పించారు.

రైలు నుంచి జారిపడి మృతి

రెంటచింతల,జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులతో కిక్కిరిసి ఉన్న రైలు ఎక్కే క్రమంలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన రెంటచింతల రైల్వే ప్లాట్‌ఫారం వద్ద ఆదివారం ఉదయం జరిగింది. జీఆర్‌పీ(జనరల్ రైల్వే పోలీసు) ఎస్ఐ వెంకట్రామయ్య తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని పాలువాయికి చెందిన తమ్మిశెట్టి ఏడుకొండలు (42), చదువుకుంటున్న తన కూతురు స్రవంతితో కలిసి గుంటూరుకు బయలు దేరాడు. టిక్కెట్లు తీసుకున్న అనంతరం కూతురు స్రవంతి బోగీలోకి ఎక్కింది. ఏడుకొండలు కూడా రైలు ఎక్కే క్రమంలో ఆయన వేసుకున్న చెప్పు జారి కిందపోయింది. దీనిని తీసుకునే క్రమంలో నిదానంగా వెళ్తున్న రైలు కింద జారి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తన తండ్రి రైలు కింద పడటంతో స్రవంతి ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయింది. గురజాల వరకు ప్రయాణించి రైలు దిగి ఘటనా స్థలానికి చేరుకుంది.

ఏడుకొండలు ముఠా మేస్త్రీగా పనిచేస్తుంటాడు.కుమారుడు శ్యామ్ విజయవాడలో బీటెక్ చదువుతుండగా, కుమార్తె స్రవంతి గుంటూరు ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుటుంబీకులను సర్పంచ్ మందలపు విజయలక్ష్మి లచ్చిరెడ్డి ఓదార్చారు. నష్టపరిహారం విషయంపై రైల్వే అధికారులతో మాట్లాడారు.

సరికొండపాలెం వీఆర్‌వో సస్పెన్షన్

బొల్లాపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరికొండ పాలెంకి చెందిన వీఆర్‌వో రవి నాయక్‌పై సస్పెన్షన్ వేటు పడినట్లు తెలియవచ్చింది. అసైన్డ్ భూములను తమ కుటుంబసభ్యుల పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఢిల్లీకి చెందిన శతన్‌సిన్హా యాదవ్‌కు చెందిన భూములను కుటుంబసభ్యుల పేరుతో రాయించారని ఆ ఫిర్యాదులో ఆరోపించారు.



లీగ్ పోటీలో గెలుపొందిన జట్టు సభ్యులు

జోరుగా హుషారుగా.. ప్రీమియర్ లీగ్ పోటీలు

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయక్రికెట్ మైదా నంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జోరుగా హుషారుగా సాగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు యువత, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. 8వ రోజైన ఆదివారం తూర్పు గోదావరి జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కడప తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తూర్పు గోదావరి 14.4 ఓవర్లలో 75 పరుగులు చేసి ఆలౌట్ అయింది. కడప 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. 4 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టిన షేక్ ఆరిఫ్ బాషా 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. కృష్ణా జిల్లా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జట్టు 16.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 4 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. 21 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టిన ఎం.శ్రీను 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును సొంతం చేసుకున్నారు. తెలుగు యువత మంగళగిరి పట్టణ అధ్యక్షుడు బోగి వినోద్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పది వేల చొప్పున మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లను అందజేశారు. ఈ పోటీలకు సేల్, సక్కు, మార్క్‌రోస్, ఉషోదయ సంస్థలు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నాయి.

సుందరయ్య కళానిలయం జాతీయ ఆహ్వాన నాటికల పోటీలు

- ఏప్రిల్ 4,5,6 తేదీలలో యడ్లపాడులో నిర్వహణ



మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్ బాబు, సమావేశంలో పాల్గొన్న సంయుక్త కార్యదర్శి నాగేశ్వరరావు, సభ్యులు రామారావు

యడ్లపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళా నిలయం జాతీయ స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఏప్రిల్ 4, 5, 6 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలుగు నాటక పరిషత్తుల సమ్మే ళనం(వేదిక), సుందరయ్య కళానిలయం నిర్వాహకులు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. యడ్ల పాడులోని వేదిక కార్యాలయంలో ఆది వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళామతల్లి ముద్దుబిడ్డ పుచ్చలపల్లి సుందరయ్య పేరిట ఏటా యడ్లపాడులో పండుగ వాతావరణంలో నిర్వహించడం రెండు దశాబ్దాల నుంచి ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిసారి మాదిరిగానే పోటీల నిర్వహణ విభిన్నంగా, కొత్త తరహాలో కళాభిమానుల మదిని దోచుకునేలా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే నాటికల పరిశీలన చేసి ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి తమ వేదికపై ప్రదర్శిస్తామన్నారు. ఈ సమావేశంలో వేదిక సంయుక్త కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం సభ్యుడు ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు

● జిల్లా పశుసంవర్ధక అధికారి నరసింహారావు

గుంటూరు సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 18 మండలాల్లో ఉన్న అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్ధక అధికారి ఓ నరసింహారావు వెల్లడించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో ఉచిత పశు ఆరోగ్య పరీక్షలు, తేలిక పాటి శస్త్రచికిత్సలు, ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, తగు వైద్యం అందించడం, పశువులకు, దూడలకు, సన్నజీవాలకు నట్టల నివారణ మందు, పశువులకు, కోళ్లకు వ్యాధినిరోధక టీకాలు ఇస్తారని తెలిపారు. శిబిరం కోసం ప్రతి మండలంలో రెండు టీంలు ఏర్పాటు చేసి ప్రతి టీంకు ఒక పశువైద్యుడిని, సహాయకుడిని, గోపాలమిత్ర, సహాయసిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పశు యజమానులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్‌ను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆవిష్కరించారు.

అనధికార కుళాయిలను తొలగించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



సచివాలయ అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో వార్డ్ సచివాల యాల వారీగా అనధికార కుళాయిల తొలగింపుపై ఇంజనీరింగ్, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్ శ్యామలనగర్, హౌసింగ్ బోర్డ్ కాలనీ, బ్రాడీపేట, లక్ష్మీపురం, పెద్దపలకలూరు రోడ్ ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను, గుజ్జనగుండ్ల సెంటర్‌లో వెండింగ్ జోన్ ప్రతి పాదిత ప్రాంతాలను పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్యామలానగర్‌లో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌కు అనధికారికంగా మున్సిపల్ కుళాయిలు ఉండటం గమనించి, సంబంధిత పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణం కనెక్షన్ తొలగించాలని ఆదేశిం చారు. బహుళ అంతస్తు భవనాల్లో ప్లాట్ల వారీగా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ కోసం వేచి ఉండ కుండా ఆస్తి పన్ను విధించాలని అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. పలు ప్రదేశాల్లో డ్రైన్లు శుభ్రం చేయడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రతి రోజు మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా కాల్వలు శుభ్రం చేయాలని, డెబ్రిస్‌ని ప్రత్యేకంగా ట్రాక్టర్లతో తీసివేయాలని ఆదేశించారు. అనంతరం కమిషనర్ గుజ్జ నగుండ్ల ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ, పట్టణ ప్రణాళిక అధికారులు, స్ట్రీట్ వెండర్స్ కలిసి పర్యటించి, త్వరలో గుజ్జనగుండ్ల ప్రాంత వీధి వ్యాపారులకు అనువు గా ఉండేలా వెండింగ్ జోన్ ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, వెంకటేశ్వరరావు, డీఈఈలు రమేష్‌బాబు, శ్రీనివాసరావు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



అమిత్‌షాకు వీడ్కోలు పలుకుతున్న పెమ్మసాని తదితరులు

కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు పెమ్మసాని వీడ్కోలు

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షాకు గన్న వరం ఎయిర్ పోర్టులో గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వీడ్కోలు పలికారు. గన్నవరం నియోజకవర్గంలోని కొండ పావులూరు ప్రాంతంలో జరిగిన ఎన్డీఆర్ఎఫ్ 20వ ఆవిర్భావ వేడుకలకు విశిష్ట అతిథిగా వచ్చిన అమిత్‌షా తన రెండు రోజుల పర్యటనను ముగించుకున్నారు. అనంతరం ఢిల్లీకి ప్రత్యేక విమానంలో తిరుగు ప్రయాణమైన ఆయనను గన్నవరం ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పెమ్మసాని గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పెమ్మసాని రాష్ట్ర అభివృద్ధి నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు, సహకారాలు అందుతా యని ఆశిస్తున్నట్లుగా అమిత్‌షాకు తెలిపారు.

భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్‌కు సావిత్రిబాయి పూలే అవార్డు



కృష్ణవేణి

గుంటూరు (విద్య) జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరాల్లోని భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న కృష్ణవేణికి సావిత్రి బాయి పూలే అవార్డు వచ్చి నట్లు తెలిపారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్‌రావు చేతుల మీదుగా కృష్ణవేణి అవార్డు అందుకున్నారు. కృష్ణవేణి 20 సంవత్సరాలుగా విద్యా రంగంలో పని చేస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. సందర్భంగా భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తదితరులు కృష్ణవేణిని అభినందించారు.

సావిత్రిబాయి పూలే స్ఫూర్తి నేటి ఉపాధ్యాయులకు ఆదర్శనీయం

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు (విద్య), జనవరి 19(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య కోసం, ఆనాటి సాంఘిక సామాజిక, దురాచారాలు మూఢనమ్మకాలపై ఆమె చేసిన పోరాట పటిమ అనిర్వచనీయమని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు పంపిణీ నిర్వహించారు. వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ బడుగు, బలహీన దళిత తదితర వర్గాల మహిళలకు చదువు ఎంతో దూరంలో ఉండేదని, అలాంటి చదువును సావిత్రిబాయి పూలే ఎంతో చొరవతో ప్రత్యేకంగా పాఠశాలలు నెలకొల్పి స్త్రీవిద్యకు ప్రాధాన్యమిచ్చారని వివరించారు. సావిత్రి బాయి పూలే ప్రతిభా అవార్డులను అందుకున్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆమె పేరుతో అవార్డుల్ని అందుకోవటం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ప్రతిభ అవార్డుల వేడుకల్లో దాదాపు 181 మంది ఉపాధ్యాయ, అధ్యాపక, ప్రొఫెసర్‌లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కన్న మాస్టారు, కాటూరి వెంకటేశ్వరరావుల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. అవార్డు గ్రహీతలను శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు, ఆంధ్ర క్రైస్తవ కళాశాల ప్రిన్సిపాల్ కొమ్మాలపాటి మోజేష్, ఆంధ్ర క్రైస్తవ న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ రాణిశ్రీ అమృత వర్షిని, లాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు



మాట్లాడుతున్న వీవీకే సురేష్, పాల్గొన్న ఎల్ఐసీ ఉద్యోగులు

దేశ ప్రయోజనాల కోసం ఎల్ఐసీ శక్తివంతం కావాలి : సురేష్

గుంటూరు(తూర్పు), జనవరి 19(ఆంధ్రజ్యోతి): దేశ ప్రయోజనాల కోసం ఎల్ఐసీ మరింతగా శక్తివంతం కావాలని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచి లీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ అన్నారు. ఎల్ఐసీ - పటిష్టమైన భారత్' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని ఎల్ఐసీ ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ పొదుపును ప్రోత్సహించే లా కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా బీమా ప్రీమియంపై విధిస్తున్న 18 శాతం జీఎస్టీ పాలసీదారులకు పెనుభారంగా మారిందని అన్నారు. బీమా మార్కెట్ రెగ్యు లేటర్‌గా ఉన్న ఐఆర్‌డీఏఐ ఇటీవల చేసిన పలు ప్రతిపాదనలు ఎల్ఐసీని బలహీనపరి చేవిగా ఉన్నాయని అన్నారు. ప్రతిపాదనలు విరమించకపోతే ఆందోళనలు తప్పవని స్ప ష్టం చేశారు. కార్యక్రమంలో కౌసర్ జానీ, సీహెచ్. మధుబాల, ఆర్‌వీఎస్ శ్రీనివాస్, పీఆర్ రాజశేకర్‌గోపాలకృష్ణ, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజక విద్య సేవాసంఘం కృషి అభినందనీయం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రజక విద్యార్థులకు పలు రూపాల్లో సహాయ, సహకారాలు అందిస్తున్న రజక విద్య సేవాసంఘం కృషి అభినందనీయమని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. రజక విద్య సేవా సంఘం డైరీని ఆదివారం తన కార్యాలయంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిభావంతులైన పేద, మధ్య తరగతి రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడమే గాక, వారి భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడమే ధ్యేయంగా విద్యా సేవాసంఘాన్ని నిర్వహిస్తున్న రజక ఉద్యోగ నేతలకు అభినందనలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు కొన సాగించాలని మాధవి వారికి సూచించారు. కార్యక్రమంలో రజక విద్యాపరిషత్ వ్యవస్థాప కులు అమృతలూరు సుబ్బారావు, పొదిలి దుర్గాప్రసాద్, వేంపాటి పాపారావు, ఎను ముల మల్లికార్జునరావు, పునుగుబాటి సత్యనారాయణ, చాగంటిపాటి శివప్రసాద్, జమ్ముల శ్రీనివాసరావు, గోవాడ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ఆవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

గుంటూరు(విద్య), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేటలోని ఆవోపా కార్యాలయంలో ఆదివారం అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్‌కం టాక్స్ జాయింట్ కమిషనర్ ఏ.తాండవ కృష్ణమూర్తి, బచ్చు తేజో శ్రీనివాస్ కుమార్, గౌరవ అతిథులుగా గుంటూరు జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వేల్పూరి వెంకటేశ్వర్లు, గౌరవ కార్యదర్శి గార్లపాటి సత్యనారాయణ పాల్గొన్నారు. తాండవ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆవోపా ఆధ్వర్యంలో పెన్షన్, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. వేల్పూరి మాట్లాడుతూ ఆవోపా ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు చాంబర్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆవోపా కార్యదర్శి రాధా కృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు, కార్యదర్శి రాచపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అపోహలు తొలగించాలి

● గూడూరు సీతామహాలక్ష్మి

గుంటూరు(తూర్పు), జనవరి 19(ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై నెలకొన్న అపోహలను తొలగించేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని అఖిల భారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు. స్థానిక అరండల్‌పేట ఆర్య సమాజం సమావేశ మందిరంలో ఆదివారం శరీర అవయవ దానంపై పలు స్వచ్ఛంద సంస్థలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి పార్థివదేహాన్ని ఖననం చేసే కంటే మరొకరికి అవయవాలు అందించడం ద్వారా మనిషి చనిపోయినా బతుకుతున్నాడని చెప్పారు. ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలాదేవి మాట్లాడుతూ అవయవ దానంపై ఆస్పత్రులు, కళాశా లల వద్ద ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త గడ్డిపాటి పద్మరాణి, నూతలపాటి తిరుపతయ్య, ఓరుగంటి నారాయణరెడ్డి, కల్లూరి మురళీధరరావు, పావులూరి రమేష్ , ఎండీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి, పాల్గొన్న సంఘ నాయకులు

ఘనంగా వాసవీ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

గుంటూరు(తూర్పు), జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వాసవీ క్లబ్ గుంటూరు, మహిళ, యువ, కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతారావు, మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా రాయవరపు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారిగా వేమూరి ప్రదీప్ కుమార్, మహిళ అధ్యక్షురాలిగా రాయవరపు అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా కూనిశెట్టి విజయలక్ష్మి, కోశాధికారిగా పరుచూరి చంద్రికతో పాటు వివిధ పథకాలకు సంబంధించిన సభ్యులతో క్లబ్ జిల్లా గవర్నర్ వీ 217ఏ పులికొండ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యుడు గార్లపాటి శ్రీనివాసులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



నూతనంగా ఎన్నికైన క్లబ్ సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న పీ.శ్రీనివాసరావు, చిత్రంలో గ్రంధి కాంతారావు తదితరులు

ఇద్దరు టీడీపీ నేతలు ఆకస్మిక మృతి



నరసింహారావు (ఫైల్)

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు టీడీపీ నేతలు ఆదివారం మృతి చెందారు. రాష్ట్ర దివ్యాంగుల సంస్థ బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత దుగ్గినేని నరసింహారావు(58) బ్లడ్‌లో ఇన్ఫెక్షన్ సోకగా, బంధువులు మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. ఇన్ఫెక్షన్ కిడ్నీకి సోకడంతో పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు.



చంద్రశేఖర్ (ఫైల్)

టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా నేత కురుగుండ్ల చంద్రశేఖర్ (50) గుండె పోటుతో మృతి చెందారు. శనివారం ఆయన పట్నం బజార్‌లోని తన ట్రాన్స్ పోర్ట్ కార్యాలయం షట్టర్ వేసి రోడ్డు మీదకు రాగా అక్కడే గుండె పోటుకు గురై కుప్పకూలి మృతి చెందా రు. చంద్రశేఖర్ టీడీపీలో క్రియాశీలకంగా పనిచేశారు. ఆయన సోదరుడు కురుగుండ్ల రామకృష్ణ నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉన్నారు.

సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకురావాలి

● హైదరాబాద్‌లోని టీసీఎస్ఈఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి

గుంటూరు(విద్య), జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను ప్రపంచ స్థాయికి తీసుకువచ్చి ఉన్నత విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని హైదరాబాద్‌లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ స్టడీస్ (ఎస్ఈఎస్) చైర్‌పర్సన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రితేష్ ఖున్యాకరి అన్నారు. చేబ్రో లు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని అకాడమీ ఫర్ ఫ్యాకల్టీ డెవలప్ మెంట్, డీన్ పీసీఎఫ్, డీన్ ఏఏఏ, డీన్ ఐక్యూఏసీ, టిస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్ ఆన్ హార్నెస్సింగ్ ద సైన్స్, టెక్నాలజీ అండ్ సొసైటీ రిలేషన్‌షిప్ ఫర్ మీనింగ్‌ఫుల్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రితేష్ ఖున్యాకరి మాట్లాడుతూ సైన్స్, టెక్నాలజీ-సమాజం మధ్య సంబంధాన్ని సులభంగా అర్థం చేసుకో వడమే కాకుండా, ఇది ఉన్నత విద్యలో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రామాణికమైన మార్పులకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌లోని టిస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జున్ సేన్‌గుప్త, ముంబాయిలోని టిస్ సీనియర్ రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ రఫిక్ షేక్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సి టీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘు నాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, ఏఎఫ్‌డీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులు, అధ్యాపకులతో డాక్టర్ రితేష్ ఖున్యాకరి తదితరులు

విద్యతో విజ్ఞానం, విజయాలు సొంతం

● ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యతో విజ్ఞానంతో పాటు విజయాలు కూడా సొంతమవుతాయని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పంపిణీకి సిద్ధంగా ఎస్ఎస్‌సీ న్యూమోడల్ టెస్ట్ పేపర్ - 2025 ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోనున్న క్యాంపు కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను విద్యారంగ ప్రముఖులు, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్, పోస్టర్‌లను ఆవిష్కరించారు. అనంతరం అప్పిరెడ్డి మాట్లాడుతూ 'ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం చదువొక్కటే' అన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలు అక్షర సత్యాలని స్పష్టం చేశారు. అందుకే, 'తల దించుకుని నన్ను చదువు - తల ఎత్తుకునేలా నిన్ను చేస్తా' అని పుస్తకాలు ఎళ్ళవేళలా విద్యార్థులను ప్రేరేపిస్తూ ఉంటాయన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అత్యంత ఉపయుక్తమైన ఎస్ఎస్‌సీ న్యూ మోడల్ టెస్ట్ పేపర్ - 2025 పుస్తకాన్ని ఉచితంగా అందజేయాలన్న సంకల్పంతో.. అందుకోసం ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూఫర్తి ఫౌండే షన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పోలే ముత్యం, కంజుల సత్యనారాయణరెడ్డి తదితరులున్నారు.



ఆన్‌లైన్ వెబ్‌సైట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

గేటెడ్ కమ్యూనిటీలో చోరీ

● రెండు ఇళ్లలో బంగారు ఆభరణాలు అపహరణ

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబుల్‌నాయుడుపాలెం కళ్ళంవారి భాగ్యనగర్ కాలనీలో గల గేటెడ్ కమ్యూనిటీలో చోరీ జరిగింది. బాపట్ల జిల్లా పర్చూరులోని గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీను నాయక్ ఇంటికి తాళం వేసి ఈ నెల 16న ఊరు వెళ్లారు. ఆదివారం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉంచిన 200 గ్రాముల బంగారు ఆభరణాలను దుండగులు అపహరించుకుపోయారు. అలాగే మరో విల్లాలో ఉండే నాగార్జునసాగర్‌లో ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేస్తున్న శ్రీను నాయక్ ఇంటిలోనూ చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా ఆయన ఊరు వెళ్లగా ఆయన ఇంటిలోని బీరువాలో ఉన్న 50 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఈ చోరీ ఘటనలపై బాధితులు ఆదివారం నల్లపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సందేశాత్మకంగా సాగిన 'చిగురు మేఘం' నాటిక



చిగురు మేఘం నాటికలో ఓ సన్నివేశం

గుంటూరు(తూర్పు), జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై కేఆర్‌కే ఈవెంట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాపరిషత్ 20వ నాటకోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ప్రదర్శించిన చిగురు మేఘం నాటిక, కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులు ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. లక్ష్మీ ప్రణీత, పుణ్యవతి, సోనిక, నాగ దివ్యశ్రీ, జ్ఞానితి, లాస్య, భాగ్యశ్రీ, మనస్విని, శాన్వి, జాహ్నవిలు పలు కీర్తనలకు కూచిపూడి ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారు కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించిన చిగురుమేఘం నాటికను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పరిషత్ నిర్వహకులు కొత్రగడ్డ రామకృష్ణప్రసాదు, బొప్పన నరసింహారావు, జి.మల్లికార్జునరావు, వేములపల్లి విఠల్ తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఆకట్టుకున్న గాత్ర శాస్త్రీయ సంగీత కచేరి



త్యాగరాజు కీర్తనలను ఆలపిస్తున్న మురళీధరన్

గుంటూరు (తూర్పు), జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, శ్రీ త్యాగ రాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో సద్గురు శ్రీ త్యాగ రాజస్వామి 178వ ఆరాధనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం లఘుకచేరీలలో భాగంగా ఏం. విజయలక్ష్మి, లంక కళ్యాణితో పలువురు గాయకులు తమ గాత్ర మాధుర్యంతో ఆహూతులను అలరించారు. సాయంత్రం ప్రధాన కచేరీలలో భాగంగా విదుషి రాజమీనాక్షి మురళీధరన్, బెంగళూరు వారి గాత్ర సంగీత కచేరీలో పలు త్యాగ రాజ కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి సంగీతాభిమానులను అలరించారు. వీరికి వయోలిన్ పై పీ. నందకుమార్, బీ. సురేష్ బాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమాల్ని సంఘ సభ్యులు గిరిజా శంకర్, వల్లూరి కృష్ణప్రసాదు పర్యవేక్షించారు.

సంగీత విద్వాంసులకు ఘన సత్కారం

గుంటూరు(తూర్పు), జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డు ఆర్టీవో ఆఫీస్ దగ్గర శిల్పారామంలో సంగీత ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన గ్రాండ్ మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను అలరించింది. సభకు నిర్వాహకులు ఎస్ వెంకట్ అధ్యక్షత వహించారు. అతిథులుగా ఇస్రో, నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు, కన్నా విద్యాసంస్థల అధినేత కన్నా మాస్టారు, సామాజిక కార్యకర్త అమా నుల్లాఖాన్ తదితరులు పాల్గొని ప్రముఖ మృదంగ విద్వాంసులు తిరునగరం ప్రభాకర్ రావు, ప్రముఖ సంత విద్వాంసులు తిరునగరం శ్రీహరిబాబులను ఘనంగా సత్కరించా రు. సభానంతరం జరిగిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల ఆకట్టుకుంది.



సంగీత విద్వాంసులకు సత్కారం నిర్వహిస్తున్న నిర్వాహకులు

నేడు, రేపు ఉరుసు గంధ మహోత్సవం

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన మంగళగిరి పార్కు రోడ్డులోని హజరత్ సయ్యద్ మాలక్ హుస్సేన్ అవులియా దర్గాలో ఈ నెల 20, 21 తేదీల్లో 57వ ఉరుసు గంధ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ట్రస్టీ మొహమ్మద్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఉరుసు మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సాహిత్య అకాడమీ అవార్డు ఆనందదాయకం

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ఆనందదాయకం అని సాహిత్య అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు అమరావతి సాహితీ మిత్రులు ఆదివారం స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో హాజరై ప్రసంగించారు. అవార్డులు వచ్చినప్పుడు ప్రశంసా, విమర్శలు సహజమే అని, విమర్శల్ని కూడా మనస్ఫూర్తిగా స్వీకరిస్తానన్నారు. అమ రావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు రచన 'దారి దీపాలు' మినీ కవితల సంపుటిని ఆయన ఆవిష్కరించారు. యర్రగుంట్ల పాణిరావు అధ్యక్షత వహించి 'దారి దీపాలు' సమీక్షిస్తూ రంగారావు మినీ కవితలు కేవలం మెరుపులు కావని, నిలిచి వెలిగే దీపాలు అని భావించారు. 'ఈ మాసం కవి'గా డాక్టర్ జెల్ది విద్యాధర్ (హైదరాబాద్) పాల్గొని చక్కని భావుకత, సామాజిక సందేశం ఉన్న కవితల్ని వినిపించి సభను రంజింపజేశారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠన కార్యక్రమంలో మేడిశెట్టి సుభద్రా కృష్ణ, డాక్టర్ మైలవరపు లలితకుమారి, మన్నం వెంకటగురువు, వక్కలగడ్డ వెంకటేశ్వరరావు తదితరులున్నారు. 'నిక్కచ్చి కవిత' పోటీలో షేక్ కాశింబి, మేడిశెట్టి సుభద్ర, గడల శివప్రసాద్ కవితలకు శాంతశ్రీ ట్రస్ట్ పక్షాన శ్రీమన్నారాయణ నగదు బహుమతులు అందజేశారు. ఈ సభలో సాహిత్య అకాడమీ అవార్డు విజేత లక్ష్మీనారా యణను, ఈ మాసం కవి విద్యాధర్‌ను, నిక్కచ్చి కవిత విజేతల్ని సంస్థ పక్షాన రావి రంగారావు, భాగ్యలక్ష్మి, పాణి రావు, డాక్టర్ లక్ష్మీ నరసింహారావు, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, ఆలీ ఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు షేక్ మస్తాన్, చంద్రయ్య ఘనంగా సత్కరించారు.



మినీ కవితల సంపుటిని ఆవిష్కరిస్తున్న పెనుగొండ, రంగారావు తదితరులు

దిక్సూచి
DIKSUCHI

ఇంటర్ ప్రాక్టికల్స్
ఇలా చేస్తే ఫుల్ మార్కులు



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య దాదాపు ఇరవై లక్షలకు దగ్గరగా ఉంటుంది. దీనిలో సగం అంటే పది లక్షల వరకు ఇంటర్ రెండో సంవత్సరంలో ఉంటారు. ఇందులో అరవై, డెబ్బయి శాతం మంది ఎంపీసీ, బైపీసీ వారే.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన జేఈఈ, నీట్, బిట్‌శాట్‌లలో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేకపోయినా, టీఎస్, ఏపీ ఎప్‌సెట్‌లలో ఎంపీసీ, బైపీసీ సబ్జెక్టులకు 25 శాతం వెయిటేజీ ఉంటుంది. దీని కారణంగా ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌కి ప్రాధాన్యం పెరిగింది. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్ కెమిస్ట్రీ సబ్జెక్టులలో 30 మార్కుల చొప్పున మొత్తం ప్రాక్టికల్స్‌కి 60 మార్కులు కేటాయించారు. బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులు కేటాయించడం జరిగింది.

- జాతీయస్థాయి పోటీ పరీక్షలపై దృష్టిపెట్టిన కొన్ని కాలేజీలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ సరిగ్గా చేయించకుండా కేవలం పరీక్షలకు ముందు తూతూ మం త్రంలాగే నడిపించి పంపుతున్నారనే వార్తలు రావడంతో ఇంటర్మీడియెట్ బోర్డు ఈ ల్యాబ్ పరీక్షలను కూడా సీరియస్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగానే సీసీటీవీల ఏర్పాటు, కచ్చితమైన అటెండెన్స్, ప్రశ్నపత్రం లీక్ కాకుండా జాగ్రత్తలతోపాటు, రికార్డు పుస్తకాలను సరిగ్గా వాల్యుయేట్ చేయించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.
- అయితే ల్యాబ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల కేవలం మార్కుల కోసమే కాకుండా కొంత సబ్జెక్టు నాలెడ్జ్ పెంచుకుంటే జేఈఈ, నీట్ పరీక్షల్లో కూడా ఉపయోగపడుతుంది. విద్యార్థులు ఈ కింది అంశాలపై దృష్టిపెడితే ప్రాక్టికల్స్‌లో పూర్తి స్థాయి మార్కులు సాధించవచ్చు.

1. **ప్రాక్టికల్ రికార్డ్ బుక్స్:** సిలబస్‌లో ఉన్న అన్ని ప్రయోగాలు, వాటి అబ్జర్వేషన్స్/ రిజల్ట్స్‌ను జాగ్రత్తగా రాయాలి. అయితే కొంతమంది విద్యార్థులు రికార్డు ఇంకొకరితో రాయిస్తారు. దీనివల్ల సబ్జెక్టు నాలెడ్జ్ పెరగకపోవడంతో, పరీక్షలో ఎగ్జామినర్ అడిగే ప్రశ్నలకు మార్క్స్‌పోగొట్టుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి రికార్డులు సొంతంగా రాయడం ఉత్తమం.
2. **ప్రయోగాల సూత్రాలు:** ఎక్విప్‌మెంట్స్ లేదా ఇన్‌స్ట్రుమెంట్స్‌తో ప్రాక్టికల్స్ చేస్తున్నప్పుడు ఆ ప్రయోగం వెనక ఉన్న ఫండమెంటల్స్‌ను, ఇన్‌స్ట్రుమెంట్స్‌ని, వాటి ఉపయోగాలను అర్థం చేసుకోవాలి. పక్కన ప్రయోగం చేస్తున్న విద్యార్థులను అనుకరించవద్దు.
3. **గ్రాఫ్ డ్రాయింగ్:** ఇది అతి ముఖ్యమైన అంశం. మీ ల్యాబ్ సిలబస్‌లో గ్రాఫ్స్ ఉన్నట్లయితే రికార్డ్ బుక్స్‌లో వాటిని జాగ్రత్తగా పొందుపర్చడంతో పాటు ఎగ్జామ్‌లో గీయాల్సి వస్తే, దానికి సంబంధించిన డేటాని సరిగ్గా విశ్లేషించాలి.
4. **డయాగ్రామ్స్:** బోటనీ, జువాలజీ ప్రయోగాలకు అవసరమైన డయాగ్రామ్స్‌ని కచ్చితంగా గీయడం నేర్చుకోవాలి. అంతే కాకుండా వాటి లేబులింగ్ స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.
5. **సేఫ్టీ:** మీ కాలేజీలో లాబ్స్ చేస్తున్నప్పుడు, పరీక్షలో కూడా కెమికల్స్, ఎలక్ట్రిసిటీకి సంబంధించిన ఇన్‌స్ట్రుమెంట్స్‌ని జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే అక్కడ ఉన్న ఇన్‌స్ట్రక్టర్‌కి తెలపాలి.
6. **మాల్‌ఫంక్షనింగ్:** పరీక్షలో ఏదైనా కారణంగాఒక ఇన్‌స్ట్రుమెంట్ సరిగ్గా పనిచేయకపోతే వెం టనే ఎగ్జామినర్‌కి తెలిపి దానిని రిపేర్ చేయించుకోవడమో లేదా ఇన్‌స్ట్రుమెంట్ మార్చుకోవడమో చేయాలి.
7. **నమూనా పరీక్షలు - ముఖ్యమైన ప్రశ్నలు:** గత సంవత్సరాల ప్రశ్నలతో ఒక ఇంపార్టెంట్ క్వశ్చన్ బుక్‌లెట్ తయారు చేసుకోవాలి. పరీక్షకు ముందు ఈ ప్రశ్నలను తప్పకుండా రివిజన్ చేసుకోవాలి.
8. **వైవా - వాయిస్:** పరీక్ష రోజు ఎగ్జామ్ హాల్‌లో మీ ప్రవర్తన సరిగ్గా ఉండాలి. పక్కన విద్యార్థిని కాపీ చేయడం లేదా మెజర్‌మెంట్స్‌ని కాపీ చేయకూడదు. వైవాలో అడిగే ప్రశ్నలకు సరిగ్గా సమాధానం ఇవ్వాలి. ప్రశ్నలు ఎలా వస్తున్నాయనే విషయంలో మీ ముందు సెషన్‌లో పరీక్షకు వెళ్లిన విద్యార్థుల నుంచి కొంత ఫీడ్‌బాక్ తీసుకోవచ్చు, ఎలాంటి తొందరపాటు లేకుండా, ఆత్మ విశ్వాసంతో పరీక్షకు హాజరైతే పూర్తి మార్కులు సాధించవచ్చు.

గుడ్‌లక్


డాక్టర్ పవన్‌కుమార్ కాసు, డైరెక్టర్
సంజీవని జూనియర్ కాలేజీ, హైదరాబాద్

SCHOLARSHIP ALERT

Kotak Suraksha



Description: Kotak Securities Limited (KSL) invites applications from students pursuing general/professional graduation.
Eligibility: Open to PwD applicants across India who are currently pursuing general or professional graduation courses. Applicants must have secured at least 55% marks in their previous academic year, and their annual family income must not exceed INR 3,20,000.
Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year
Last Date to Apply: 23-01-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/KSSP3

buddy4study.com

ఉద్యోగ కార్నర్: జాబ్ కార్నర్

హెచ్‌పీసీఎల్‌లో డిప్లొమా అభ్యర్థులకు..

మొత్తం ఖాళీలు **234**

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) జూనియర్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా చేసిన ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఫిబ్రవరి 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **జూనియర్ ఎగ్జిక్యూటివ్ (మెకానికల్):** 130 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఎలక్ట్రికల్):** 65 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్‌స్ట్రుమెంటేషన్):** 37 పోస్టులు
- **జూనియర్ ఎగ్జిక్యూటివ్(కెమికల్):** 2 పోస్టులు

అర్హత: పోస్టుకు సంబంధించిన బ్రాంచ్‌లో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా పూర్తి చేసి ఉండాలి.
వయస్సు: అభ్యర్థుల వయస్సు దరఖాస్తు దాఖలు చేసే తేదీ నాటికి 18-25 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తు విధానం: 2025 ఫిబ్రవరి 14 తేదీలోపు దరఖాస్తు దాఖలు చేయాలి.
పూర్తి వివరాల కోసం www.hindustanpetroleum.comలో Careers?Current Openings వెబ్‌పేజీ చూడవచ్చు.

ఇండియన్ ఆర్మీలో క్రీడా కోటా

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్(క్రీడా కోటా) ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఈ డైరెక్ట్ ఎంట్రీ ఉద్యోగాలకు 2025 ఫిబ్రవరి 28లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.
క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్ హాకీ, హ్యాండ్‌బాల్, జూడో, కయాకింగ్ అండ్ కెనోయింగ్, కబడ్డీ, స్విమ్మింగ్, సెయిలింగ్, షైటింగ్, ట్రయాథ్లాన్, వాలీబాల్, వుషు, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, రోయింగ్.
అర్హత: పది/ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు, నిర్దుష్టమైన శారీరక ప్రమాణాలు ఉండాలి. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్/ ఖేలో ఇండియా గేమ్స్/ యూత్ గేమ్స్/ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులై ఉండాలి.
వయస్సు: పదిహేడున్నర సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2000 మార్చి 31 నుంచి 2007 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్‌క్యూ(ఆర్మీ), రూమ్ నెం.747, 'ఏ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామాకు పంపించాలి.
పూర్తి వివరాలకు https://joinindianarmy.nic.in/Authentication.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.

నేడు, రేపు ఉరుసు గంధ మహోత్సవం

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన మంగళగిరి పార్కు రోడ్డులోని హజరత్ సయ్యద్ మాలక్ హుస్సేన్ అవులియా దర్గాలో ఈ నెల 20, 21 తేదీల్లో 57వ ఉరుసు గంధ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ట్రస్టీ మొహమ్మద్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. సోమవారం రాత్రి పకీర్లు సన్నాయి, బ్యాండుమేళంతో ఊరేగింపుగా బయల్దేరి మంగళవారం ఉదయం ఈఎస్ఆర్ గార్డెన్స్ వెనుక ఉన్న దర్గాకు చేరుకుని, అక్కడ గంధం, ఫతేహ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మంగళవారం సాయంత్రం దీపారాధన, ప్రసాదాల పంపిణీ అనంతరం రాత్రి పది గంటలకు ఖవాలి ప్రోగ్రాం జరుగుతుందని చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఉరుసు మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

నేడు పాండ్రపాడులో రీ సర్వే

కాకుమాను, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నేడు మండలపరిధిలోని పాండ్రపాడులో భూ సర్వే కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ వెంకటస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రైతులు ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని అధికారులకు సహకరించాలని వివరించారు. గ్రామంలో 185 సర్వే నెంబర్లలో రీ సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో నాలుగు టీంలు రోజుకు 20 ఎకరాల్లో సర్వే చేయనున్నట్లు చెప్పారు. రైతులు అడంగల్, మ్యూటేషన్లలో సక్రమంగా ఉండాలని తెలిపారు.

పసుపు రైతులకు పరిహారం చెల్లించాలి

మంగళగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని ఏపీ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో సుమారు లక్ష బస్తాల పసుపు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. రైతులను ఆదుకోవాలని అనేక ఉద్యమాలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్వింటాల్‌కు రూ.7 వేల చొప్పున పరిహారం అందిస్తామని చెప్పి నాలుగు నెలలైనా రైతులకు న్యాయం జరుగలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి రైతులకు పరిహారం అందజేయాలని కోరారు.

రేపటి నుంచి పశు వైద్యశిబిరాలు

తుళ్లూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలంలో మంగళవారం నుంచి పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు అన్ని గ్రామాల్లో పశువైద్య శిబిరాలు జరుగుతాయని తెలిపారు. పెద్ద పశువులు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, టీకాలు వేయనున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో కోరారు. ఈ నెల 21న వడ్డమాను పెదపరిమి. 22న నేలపాడు నెక్కల్లు, 23న శాఖమూరు, 24న హరిశ్చంద్రపురం 25న దొండపాడు, అబ్బరాజుపాలెం, 27న మల్కాపురం మందడం, 28న రాయపూడి, లింగాయపాలెం. 29న వెంకటపాలెం, 30న వెలగపూడి ఉద్దండ్రాయునిపాలెం, 31న ఐనవోలు గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహస్తున్నట్టు తెలిపారు.

అవయవదానంపై అపోహలు తొలగించాలి

● గూడూరు సీతామహాలక్ష్మి



మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి, పాల్గొన్న సంఘ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 19(ఆంధ్రజ్యోతి): అవయవ దానంపై నెలకొన్న అపోహలను తొలగించేందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని అఖిల భారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు. స్థానిక అరండల్‌పేట ఆర్య సమాజం సమావేశ మందిరంలో ఆదివారం శరీర అవయవ దానంపై పలు స్వచ్ఛంద సంస్థలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి పార్థివదేహాన్ని ఖననం చేసే కంటే మరొకరికి అవయవాలు అందించడం ద్వారా మనిషి చనిపోయినా బతుకుతున్నాడని చెప్పారు. ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలా దేవి మాట్లాడుతూ అవయవదానంపై ఆస్పత్రులు, కళాశాలల వద్ద ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త గడ్డిపాటి పద్మరాణి, నూతలపాటి తిరుపతయ్య, ఓరుగంటి నారాయణ రెడ్డి, కల్లూరి మురళీధరరావు, పావులూరి రమేష్, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య అకాడమీ అవార్డు ఆనందదాయకం

● పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావటం ఆనందదాయకం అని అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు అమరావతి సాహితీ మిత్రులు ఆదివారం ఉదయం స్థానిక బ్రాడీపేట సర్విస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య సమావేశంలో హాజరై ప్రసంగించారు. అవార్డులు వచ్చినప్పుడు ప్రశంసా, విమర్శలు సహజమే అని, విమర్శల్ని కూడా మనస్ఫూర్తిగా స్వీకరిస్తానన్నారు. అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు రావి రంగారావు రచన 'దారి దీపాలు' మినీ కవితల సంపుటిని ఆయన ఆవిష్కరించారు. సభలో పెనుగొండ లక్ష్మీనారాయణను పలువురు రచయితలు, ఆలీ ఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం తెలుగు ఆచార్యులు షేక్ మస్తాన్ ఘనంగా సత్కరించారు.

అధ్వానంగా ఇన్నర్ రింగ్ రోడ్డు

● గుంతల మయంగా రహదారి
● వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
● పట్టించుకోని సీఆర్‌డీఏ అధికారులు



నల్లపాడు నుంచి నేషనల్ హైవేకి వెళ్లే ఇన్నర్ రింగ్‌రోడ్డు



గుంతల మయంగా ఉన్న ఇన్నర్‌రింగు రోడ్డు

మేడికొండూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పేరుకే ఇన్నర్ రింగ్ రోడ్డు.. అంతా గుంతల మయం... ఇది నల్లపాడు సమీపంలోని మహాత్మాగాంధి ఇన్నర్ రోడ్డు దుస్థితి. నేషనల్ హైవే 16కు అనుసంధానంగా ఉండే ఈ రహదారి ప్రస్తుతం భారీగా గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గోతుల్లో పడి భారీ వాహనాలు దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా ఇన్నర్ రింగ్ రోడ్డు గతుకులమయమై వాహనదారులు ఇక్కట్లు పడుతున్నా సంబంధిత సీఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సత్తెనపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు గుంటూరు నగరంలోకి ప్రవేశించకుండా విజయవాడ వైపుకు, చిలకలూరిపేట వైపుకు వెళ్లాలంటే నల్లపాడు వద్ద నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు ద్వారా నేషనల్ హైవే 16కు వెళ్లాల్సి ఉంటుంది. నల్లపాడు, హైవే 16కు మధ్య సుమారు 3కిలో మీటర్ల పొడవున్న ఈ రహదారి మొదటి కిలోమీటరు జిల్లా పరిషత్ పరిధిలో ఉండగా ఇటీవలే రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. మిగతా రెండు కిలో మీటర్లు రహదారి సీఆర్‌డీఏ పరిధిలో ఉంది. గుంటూరు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఇన్నర్ రింగ్‌రోడ్డుకు రూపకల్పన జరిగింది. దీనికి మహాత్మాగాంధి ఇన్నర్ రింగ్ రోడ్డుగా నామకరణం చేశారు. ఆటోనగర్ వద్ద ప్రారంభమైన ఇన్నర్ రింగ్ రోడ్డు అమరావతి రోడ్డు, పెదపలకలూరు, నల్లపాడు మీదుగా నేషనల్ హైవేకు కలిపారు. ఆటోనగర్ నుంచి ఆర్టీఏ ఆఫీసు వరకు వివిధ దశల్లో రహదారిని నిర్మించారు. దీనికి అనుసంధానంగా అప్పటికే నల్లపాడు నుంచి హైవే వరకు డొంకను ఇన్నర్ రింగ్ రోడ్డు కింద మార్చి రహదారిని పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ రహదారి రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(సీఆర్‌డీఏ) పరిధిలో ఉంది. అయితే ఆటోనగర్ నుంచి ఆర్టీఏ ఆఫీసు వరకు ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్డుకు అధికారులు తరచు మరమ్మతులు చేస్తున్నా నల్లపాడు నుంచి హైవే వరకు ఉన్న రోడ్డును మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్ని పిర్యాదులు చేస్తున్నా అవి బుట్టదాఖల అవుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈరోడ్డులోని గుంతలను ఎవరూ పట్టించుకోలేదు. కనీసం ప్రభత్వం మారిన తరువాత అయినా ఈ రహదారికి మోక్షం లభిస్తుందని అందరూ భావించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్రాంతి నాటికి రోడ్లపై ఎక్కడా గోతులు లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని స్థానికులు ఇప్పుడు గుర్తు చేస్తున్నారు. సంక్రాంతి పండుగ వెళ్లిపోయినా ఈ రహదారిలో కనీసం గుంగలు పూడ్చలేదని ఆరోపిస్తున్నారు.

వాహనదారుల అవస్థలు

నల్లపాడు నుంచి హైవేకు వెళ్లాలంటే ఈ ఇన్నర్ రింగ్ రోడ్డు ఒక్కటే ఆధారం కావడంతో అనేక వాహనాలు తప్పనిసరి పరిస్థితిలో ఈ రహదారి నుంచే వెళుతుంటాయి. నానాటికి రహదారిలో గోతులు భయానకంగా మారడంతో కార్లు, మినిలారీలు, మోటార్ సైకిళ్లు అంకిరెడ్డిపాలెం మీదుగా హైవేకు వెళుతున్నాయి. అంకిరెడ్డిపాలెం రోడ్డు గ్రామంలో ఇరుకుగా ఉండడంతో తరచు ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. ఇక పెద్ద వాహనాలు తప్పనిసరిగా ఈ రహదారినే వెళ్లాల్సి రావడంతో భారీ బరువుతో వచ్చే వాహనాలు గోతుల్లో పడి త్వరగా మరమ్మతులకు వస్తున్నాయి. కమాన్ కట్టలు ఇరిగిపోవడం, టైర్లు పగిలిపోవడం వంటివి జరుగుతున్నాయి. నల్లపాడు ప్రధాన రహదారి నుంచి మొదలయ్యే ఈ రింగ్‌రోడ్డుకు మొదటి కిలో మీటరు జిల్లా పరిషత్ పరిధిలో ఉండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిని నిర్మించారు. అప్పట్లో రోడ్డుకు భారీ గుంతల పడి దుమ్ము, ధూళి రోడ్డుకిరువైపల ఉన్న ఇళ్లను కప్పేసేది. దీనికి తోడు లారీలు గుంతల్లో పడినప్పుడల్లా వస్తున్న శబ్దాలకు అపార్ట్‌మెంట్‌లలో ఉంటున్న వారు సైతం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఆరోడ్డులో నివాసముంటున్నవారంతా ఏకమై రోడ్డు మరమ్మతులు చేయకపోతే ఆందోళన చేస్తామని, ఇన్నర్‌రింగ్ రోడ్డులో వాహనాల రాకపోకలను అడ్డుకుంటామని హెచ్చరించడంతో వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చొరవతో జిల్లా పరిషత్ అధికారులు ఆగమేఘాల మీద కిలో మీటరు రోడ్డు నిర్మించారు. కానీ తమ పరిధిలో ఉన్న మిగతా రెండు కిలో మీటర్ల రోడ్డును సీఆర్‌డీఏ అధికారుల మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులు ఈ రహదారికి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక కేంద్రంగా చిలువూరు

● ఐఆర్ఐడీఆర్ పూర్వ చైర్మన్ మహేంద్రదేవ్

దుగ్గిరాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక కేంద్రంగా చిలువూరు విలసిల్లనుందని, ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ పూర్వచైర్మన్ సూర్యదేవర మహేంద్రదేవ్ అన్నారు. చిలువూరులో నూతనంగా నిర్మించిన కొండపనేని రంగారావు కళావేదికను ఆదివారం ప్రారంభించారు. మహేంద్రదేవ్ మాట్లాడుతూ తాను ఆరు, ఏడు తరగతులు చదివానని కొండపనేని రంగారావు హైస్కూల్ గొప్ప విద్యాసంస్థగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ప్రాథమిక విద్య కీలకమైందని, స్వాతంత్ర్యం వచ్చాక ప్రాథమిక విద్య ప్రారభించినప్పటికీ ప్రాధాన్యం తగ్గిందని, ఐఐటీలను ప్రోత్సహిస్తూ వచ్చారన్నారు. నైపుణ్య విద్యలో అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ వెనుకబడ్డామన్నారు. పోషకాహారం లోపాలను 35శాతం మంది ఎదుర్కొంటున్నారని, మహిళల్లో రక్తహీనత ఎక్కువ ఉందన్నారు. వైవిధ్య పంటలకు ప్రోత్సాహం లేదని, విద్యనాణ్యత పెరిగితే వ్యవసాయ రంగంలోనూ మార్పులు వస్తాయన్నారు. కేంద్రప్రభుత్వ సహకారం పెరగాలన్నారు. నైపుణ్యానికి ప్రముఖ బయోఫార్మా బయోఫర్ సీఈవో డాక్టర్ రంగిశెట్టి జగదీష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళావేదిక ప్రారంభోత్సవంలో డాక్టర్ మహేంద్రదేవ్ మాట్లాడుతూ డాక్టర్ జగదీష్ బాబు మాట్లాడుతూ గుడికంటే బడి గొప్పదని, గ్రామం కోసం సీపీఎం నాయకులు కాట్రగడ్డ నారాయ ణరావు అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఆస్తులు నేడు ఉండవచ్చు, రేపటి రోజున పోవచ్చు, కానీ సీపీఎం నాయకుడిగా నారాయణరావు అందరికీ సుపరి చితుడని, మాటలు చెప్పేవారున్నారు, కానీ విద్య కోసం ఆస్తులు ఇచ్చేవారు నేటికాలంలో అరుదన్నారు. పాఠశాల భవిష్యత్తు కోసం 18 ఎకరాలు పాఠశాలకు రాసిచ్చారని తెలిశాక, ఆయనపై గౌరవం మరింత పెరిగిందన్నారు. రాజ్యసభ మాజీసభ్యుడు పీ మధు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎయిడెడ్ సంస్థలను రద్దు చేయడం అన్యాయమన్నారు. వచ్చే ఏడాది కొండపనేని రంగారావు హైస్కూల్లో పదో తరగతిని ప్రారంభించనున్నామన్నారు. గుంటుపల్లి రమేష్, కాట్రగడ్డ వెంకటసుబ్బయ్య హైస్కూల్ ట్రస్టుసభ్యుడు పిన్నమనేని మురళీకృష్ణ, కేఆర్ ఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ హెచ్ఎం పీవీ నరసింహారావు, కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతిరాయ్, యూటీఎఫ్ సహాధ్యక్షురాలు కుసుమకుమారి, మాజీ జడ్పీటీసీలు యేళ్ల జయలక్ష్మి, వెంకట్రావు, రంగిశెట్టి రమేష్‌బాబు జెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా పర్యటనకు వ్యతిరేకంగా నిరసన



మంగళగిరిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామ పక్ష పార్టీల నేతలు

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఏపీ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలియజేశారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, ప్రజాతంత్ర వాదులు తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ప్లకార్డులను ప్రదర్శిస్తూ అమిత్ షా గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ప్రపంచ దేశాలు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తుంటే అమిత్‌షా మాత్రం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవహేళనగా మాట్లాడడం సిగ్గుచేటని విమర్శించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్ లాల్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తోసిపుచ్చి మనువాద రాజ్యాంగాన్ని ప్రజలపై రుద్దేందుకు మోదీ, అమిత్‌షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆత్మకూరులో సాయిబాబా ఆలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమాల్లో వామపక్ష నేతలు పాల్గొన్నారు.

● **తాడేపల్లి (ఆంధ్రజ్యోతి):** భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ, పరిపాలన చేస్తున్న బీజేపీ కేంద్ర మంత్రి అమిత్‌షా గో బ్యాక్ అని తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బోసు బొమ్మ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో అమిత్‌షా పర్యటనను నిరసిస్తూ సీపీఎం, సీపీఐ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి పట్టణ నాయకులు వేముల దుర్గారావు, దొంతిరెడ్డి విజయ భాస్కరరెడ్డి, కొట్టే కరుణకార్ తదితరులు పాల్గొన్నారు.

● **తాడికొండ (ఆంధ్రజ్యోతి):** కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎంలు తాడికొండలో ఆదివారం నిరసన చేపట్టారు. పోలీసుస్టేషన్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మౌనం పాటించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు, కుర్ర అనిల్ కుమార్, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కర రావు, బాణావత్ భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● **తుళ్లూరు,(ఆంధ్రజ్యోతి):** కేంద్ర మంత్రి అమిత్ షాను తక్షణం మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నవీన్ ప్రకాశ్, బాబురావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


రెడ్ల ఆత్మీయ సమ్మేళనం



నియోజకవర్గ రెడ్ల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నేతలు

తాడేపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన జయంతిని పురస్కరించుకుని రెడ్ల సామాజిక వర్గ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం తాడేపల్లి ఆశ్రమ రోడ్డులోని కళ్లం రత్తారెడ్డి, తులశమ్మ రెడ్ల సత్రం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ రెడ్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ రెడ్లు ఐక్యంగా ఉండాలని, నియోజకవర్గంలో త్వరలో రెడ్డి సంక్షేమ సంఘాన్ని ప్రారంభించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొంతి రెడ్డి వేమారెడ్డి, తెలుగురైతు పార్లమెంట్ గుంటూరు అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, గాదె నాగిరెడ్డి, భీమిరెడ్డి శివారెడ్డి, మేకా పుల్లారెడ్డి, కొండా నవనీత్ కృష్ణారెడ్డి, రాజేష్‌రెడ్డి, మేకా అంజిరెడ్డి, అరవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు ఘన నివాళి



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

పెదనందిపాడు, జనవరి, 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో విప్లవకారుడు యోగివేమన జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు మాట్లాడుతూ మూఢనమ్మకాలను, అపచారాలను ఎత్తిచూపి, తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచిని అభ్యుదయ వాది ప్రజాకవి సంఘసంస్కర్త నిజమైన విప్లవకారుడు యోగి వేమన అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పీ సుభాషిణి, వెలినేని శివయ్య, మంజుల, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

తాడికొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా తాడికొండలో బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి సారథ్యంలో శంకర కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 91 మందికి పరీక్షలు చేయించుకొనగా 44 మందికి శుక్లములున్నట్టు గుర్తించారు. వారికి బస్సు సౌకర్యం కల్పించి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తారని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరి బండ్ల కోటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మేఘన, తనీమా, టీడీపీ నాయకులు బండ్ల పట్టాభిరామయ్యధనేకుల హరిబాబు, కొలకపూడి రమేష్, షేక్ రఫీ, తాయి శ్రీహరి, ముత్యాలు, గోగినేని పుల్లారావు, మిత్రమండలి సభ్యులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు ఆదివారంతో 47వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను ఏఐఎఫ్‌టీయూ నాయకులు కే ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్‌లు ప్రారంభించి మాట్లాడుతూ కార్మికులు న్యాయబద్ధంగా తమకు రావలసిన నష్ట పరిహారం కోసం పోరాటం చేస్తున్నారని, పాలకులు మాత్రం సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు నిర్లక్ష్య వైఖరిని విడనాడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షల్లో నవనీతం, శారద, రమణ, ఎస్ శారమ్మ, ఎస్ ధనమ్మ, తదితరులు కూర్చున్నారు. ఈ కార్యక్రమానికి మద్దతుగా ఆశీర్వాదం, అంకయ్య, గురవయ్య, వై సాంబయ్య, ఎం శివకుమారి, ఎస్‌కే ఇమాంబి, గోపి, నరసింహారావు, ఎస్‌కే బాష, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గేటెడ్ కమ్యూనిటీలో చోరీ

● రెండు ఇళ్లలో బంగారు ఆభరణాలు అపహరణ

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓబుల్ నాయుడుపాలెం కళ్ళంవారి భాగ్యనగర్ కాలనీలో గల గేటెడ్ కమ్యూనిటీలో చోరీ జరిగింది. బాపట్ల జిల్లా పర్చూరులోని గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీనునాయక్ ఇంటికి తాళం వేసి ఈ నెల 16న ఊరు వెళ్లారు. ఆదివారం వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉంచిన 200 గ్రాముల బంగారు ఆభరణాలను దుండగులు అపహరించుకుపోయారు. అలాగే మరో విల్లాలో నివాసం ఉండే నాగార్జున సాగర్‌లో ఎలక్ట్రికల్ ఏఈగా పనిచేస్తున్న శ్రీనునాయక్ ఇంటిలోనూ చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబంతో ఆయన ఊరు వెళ్లగా ఇంటిలోని బీరువాలో ఉన్న 50 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. ఈ ఘటనలపై బాధితులు ఆదివారం నల్లపాడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతలు ఆకస్మిక మృతి

గుంటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు టీడీపీ నేతలు ఆదివారం మృతి చెందారు. రాష్ట్ర దివ్యాంగుల సంస్థ బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత దుగ్గినేని నరసింహారావు(58) బ్లడ్‌లో ఇన్ఫెక్షన్ సోకగా, బంధువులు మంగళగిరిలోని ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా నేత కురుగుండ్ల చంద్రశేఖర్ (50) గుండెపోటుతో మృతి చెందారు. పట్నం బజార్‌లోని తన ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం షట్టర్ వేసి రోడ్డు మీదకు రాగా అక్కడే కుప్పకూలి మృతి చెందారు.

హరిత సాయికి మంత్రి లోకేశ్ అభినందన



హరిత సాయిని అభినందిస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు టైపు రైటింగ్ లోయర్ గ్రేడ్ పరీక్షల్లో ఆరాధ్యుల హరిత సాయిని మంత్రి నారా లోకేశ్ అభినందించారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన హరిత సాయి మంగళగిరి పట్టణంలోని మాధవి టైపు ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతూ ఏపీ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన టైపు రైటింగ్ పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడంపై మంత్రి లోకేశ్ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మాధవి టైపు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ పీ మురళీధర్, హరిత సాయి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

పెదనందిపాడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధిని మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో 3వ బ్యాచ్ కుట్టు శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలోని మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు, నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కేంద్రాన్ని ఆ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమాల నిర్వహణకు చేయూతనందిస్తున్న పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావును అభినందించారు. కార్యక్రమంలో అనంతరం శిక్షణ పొందిన మహిళలకు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు దొప్పలపూడి రమేష్ బాబు, పారిశ్రామికవేత్తలు దాసరి శేషగిరిరావు, అరవపల్లి కృష్ణ, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్ర మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు, మక్కెన జవహర్‌రాణి, కాపు వెంకటసుబ్బారావు, శివప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు



బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులతో చీఫ్ మార్షల్ గణేష్‌బాబు

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ కోచింగ్ సెంటర్లో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. మంగళగిరి, పెదవడ్లపూడి, కాజ, నంబూరు ప్రాంతాలకు చెందిన కరాటే శిక్షణ కేంద్రాల విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు వారివారి విభాగాల్లో ఉత్తీర్ణత సాధించి ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, బ్లాక్ బెల్టులు సొంతం చేసుకున్నారు. ఏపీ చీఫ్ మార్షల్ వి.గణేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై గ్రేడింగ్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఏపీ జేఎస్‌కేఏఎస్ టెక్నికల్ డైరెక్టర్ జీకే శేఖర్, ప్రధాన కార్యదర్శి డి.ప్రభాకర్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. బెల్టులు సాధించిన విద్యార్థులను ఎంఎంకే స్టేడియం ప్రతినిధులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తాడేపల్లి టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం కేసీ వర్క్స్ హైస్కూల్ 1992-93 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను గుర్తు చేసుకుని వారిని సత్కరించారు. తమ పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. సమాజహిత కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. ఉపాధ్యాయులు టీఎస్ఆర్ మాస్టారు, తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కురగంటి వెంకటేశ్వరరావు, ప్రణీత్, దర్శి రమేష్, రాంబాబు, శ్రీనివాసరావు, జగన్మోహిని, లక్ష్మి ప్రసన్న, వరలక్ష్మి, దుర్గారమాదేవి, ఉమాదేవి, సువార్త, దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాల జడ్పీ బాలురోన్నత పాఠశాలలో 1995-96లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగిందని, విద్యార్థి జీవితంలో జ్ఞాపకాలను నెమరువేసుకుని, ఆనందోత్సాహాల మధ్య కోలాహలంగా గడిపారు. వివిధ వృత్తి, వాపారాలు, ఉద్యోగాల్లో స్థిరపడి, 30ఏళ్ల అనంతరం కలుసుకుని అప్యాయతలను పంచుకుని మధ్యాహ్నం కలిసి సహపంక్తి భోజనం చేసి, తమ అనుభవాలను పంచుకున్నారు. **(దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)**

సీఎం సహాయనిధి నగదు చెక్కు అందజేత




తుమ్మపూడికి చెందిన వల్లభనేని దుర్గారావు కుటుంబ సభ్యులకు సీఎం సహాయనిధి నగదు చెక్కును అందిస్తున్న టీడీపీ నాయకులు

దుగ్గిరాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మపూడిలో అనారోగ్యంతో మృతి చెందిన వల్లభనేని దుర్గారావు కుటుంబసభ్యులకు సీఎం సహాయనిధి నగదు చెక్కును శనివారం అందించారు. కుటుంబాన్ని పోషించుకునేందుకు పనిచేసే స్థితిలో లేక, కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణకు సాయం కోరుతూ, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, సీఎం సహాయనిధి నుంచి రూ.87,000 మంజూరు చేశారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, మాజీ సర్పంచ్ నర్రా శ్రీనివాసరావు, ఎంపీటీసీ వాసిరెడ్డి లక్ష్మీదేవి, బుస్సా నాగరాజు, నాలాది మరియదాసు, కేసంనేని వాసుబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కష్టంలో ఉన్నప్పుడు అండగా ఉంటానని ఎన్నికల సమయంలో చెప్పి మాట నిలబెట్టుకుంటున్న నారా లోకేశ్‌కు దుర్గారావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణదారుల చెరలో పోతురాజుస్వామి గుడి

● మూడంతస్తుల అనధికార భవన నిర్మాణం


పోతురాజు స్వామి గుడి స్థలంలో నిర్మిస్తున్న మూడంతస్తుల భవనం

కొల్లిపర, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర గ్రామం మధ్యలో ఎకరం 80 సెంట్ల విస్తీర్ణంలో గ్రామ రక్షకుడైన పోతురాజు స్వామి దేవాలయం నిర్మించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి పోతురాజు స్వామి కొలుపులను గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ప్రస్తుతం పోతురాజు స్వామి దేవాలయాన్ని పరిశీలిస్తే కేవలం 20 సెంట్లు మాత్రమే మిగిలింది. మిగిలిన ఎకరం 60 సెంట్లకుపైగా దేవాలయ ప్రాంగణం ఆక్రమదారుల చెరలో ఉంది. నివాస స్థలంలేని పేదలు, నిరుపేదలు ఈ దేవాలయ స్థలంలో గృహాలు ఏర్పరుచుకుని అనధికారంగా నివసిస్తున్నారు. ప్రభుత్వం పలు పర్యాయాలు నివేశన స్థలం లేని గ్రామస్తులకు నివాసస్థలం... గృహాల కేటాయింపు జరిపినప్పటికి పోతురాజుస్వామి దేవాలయ ప్రాంగణంలో మాత్రం ఆక్రమణదారుల కబ్జా తొలగలేదు. తాత్కాలిక ఇళ్లు నిర్మించుకున్నారా అంటే ఏకంగా ఒక ఆక్రమణదారుడు మూడు అంతస్తుల భవన నిర్మాణం చేపట్టడం విశేషం. అది కూడా ఎటువంటి అనుమతులు లేని కట్టడం. ఈ అక్రమ నిర్మాణంపై నేటివరకు సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో స్థానికులు ఈ మూడంతస్తుల అక్రమ కట్టడంపై కలెక్టరు, సంబంధిత పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు ప్రస్తుతం నోటీసులు మాత్రమే జారీ చేశారు.

ధర్నాను విజయవంతం చేయాలి

● అగ్నిప్రమాద బాధిత పసుపు రైతుల సంఘం నాయకుడు శివసాంబిరెడ్డి



మున్నంగిలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కొల్లిపర, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తెనాలి న్యూ ఇండియా అస్యూరెన్స్ కార్యాలయం వద్ద సోమవారం జరిగే పసుపు రైతుల ధర్నాను విజయవంతం చేయాలని అగ్నిబాధిత పసుపు రైతుల సంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మున్నంగి, వల్లభాపురం గ్రామాల్లో ఆయన పసుపు రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ దుగ్గిరాల శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో పసుపు కాలిపోయి సంవత్సరం కావస్తున్నా ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు తెనాలి మారీసుపేటలో న్యూ ఇండియా అస్యూరెన్స్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. సమావేశంలో కొమ్మారెడ్డి రంగారెడ్డి, బొంతు వెంకటరెడ్డి, అచ్యుతసురేష్, వంగా కోటిరెడ్డి, కొండా లక్ష్మారెడ్డి, లంకిరెడ్డి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుని సత్సంగ కేంద్ర వార్షికోత్సవం


కూచిపూడి నాట్యం ప్రదర్శిస్తున్న బాలికలు

తెనాలి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని టీజీకే కల్యాణ మండపంలో సద్గురు సాయినాథుని సత్సంగ కేంద్ర 33వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజల్లో పాల్గొన్నారు. నేటి యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక భావం ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమాలను బాబా భజనతో ప్రారంభించారు. సామూహిక సాయి చరిత్ర పారాయణం నిర్వహించారు. నటరాజ నృత్య కళానికేతన్ బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. సాయిసత్ చరిత్ర నుంచి సత్సంగ కార్యక్రమాన్ని, హారతి, ప్రసాదాల పంపిణీ, వార్షిక నివేదికను నిర్వాహకులు వివరించారు. నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. నోరి నారాయణమూర్తి, సాయి సత్య శ్రావణి, నిర్మలారమేష్, నారాయణరావు, దత్తు, ఫణి, సాయి, రామలింగేశ్వరరావు, సాంబిరెడ్డి పర్యవేక్షించారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు


బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థులతో చీఫ్ మార్షల్ గణేష్‌బాబు

మంగళగిరి సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఎదురుగా వున్న కరాటే అండ్ మార్షల్ ఆర్ట్స్ కోచింగ్ సెంటరులో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. మంగళగిరి, పెదవడ్లపూడి, కాజ, నంబూరు ప్రాంతాలకు చెందిన కరాటే శిక్షణా కేంద్రాల విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు వారి వారి విభాగాల్లో ఉత్తీర్ణత సాధించి ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, బ్లాక్ బెల్టులు సొంతం చేసుకున్నారు. ఏపీ చీఫ్ మార్షల్ వి.గణేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై గ్రేడింగ్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఏపీ జేఎస్‌కేఎస్ టెక్నికల్ డైరెక్టర్ జీకే శేఖర్, ప్రధాన కార్యదర్శి డి.ప్రభాకర్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. బెల్టులు సాధించిన విద్యార్థులను ఎంఎంకే స్టేడియం ప్రతినిధులు అభినందించారు.

వ్యర్థాలను తొలగించరూ...


యడ్లలింగయ్య కాలనీలో దారివెంట పేరుకుపోయిన చెత్త

తెనాలి మారీసుపేట, జనవరి 19(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీరావుపేట 32వ వార్డు యడ్లలింగయ్య కాలనీలోని ఎస్టీ కాలనీలో రోడ్డు వెంబడి వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గత కొన్ని నెలలుగా ఆ కాలనీలో సేకరించిన చెత్తను అక్కడే రోడ్డు పక్కన పడ వేయడంతో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ఆ ప్రాంతంలో వ్యర్థాల నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ రోడ్డులో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో దోమలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తరలించి, డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తైక్వాండో పోటీలలో తెనాలి క్రీడాకారులకు పతకాలు


బాలబాలికలను అభినందిస్తున్న మురళి, నాగభూషణం

తెనాలి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో పోటీలలో తెనాలి క్రీడాకారులు పతకాలు సాధించారు. ఏపీ స్టేట్ కిడ్స్ చాంపియన్ ఆఫ్ చాంపియన్స్ పోటీలు రేపల్లెలో రెండు రోజుల పాటు నిర్వహించారు. తెనాలి కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీలో శిక్షణ పొందిన బాలబాలికలు పోటీల్లో పాల్గొన్నారు. అభిరామ్, హారిక వర్మ, హరిణి, శిరీష, ఆరాధ్య, కోమల్, హితేష్‌రెడ్డి, శౌర్య, జ్ఞానతేజ, కానేంద్ర, రాగుడిచావల్ గోల్డ్ మెడల్ సాధించారు. కృతిక, ఫాతిమా, లోహిక్ష, మహీధర్, షణ్ముక, చైతన్య, మోహన చంద్ర, ధీరజ్, అక్షయ్ సిల్వర్ మెడల్స్, కృషిక, ఆరాధ్య సాయిచరణ్, చరణ్‌యాదవ్, జ్యోతేంద్రలు బ్రాంజ్ మెడల్స్ పొందారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అకాడమీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, కోచ్ శ్రీనివాసరావు అభినందించారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి


మృతురాలికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, తదితరులు

పొన్నూరుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో 19వ వార్డు వీవర్స్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త కనపర్తి అబ్రహం మృతి చెందారు. ఆదివారం అబ్రహం మృతదేహాన్ని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్రహం కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే టీడీపీ కార్యకర్త ఆరే రమణ, తల్లి సామ్రాజ్యం ఇటీవల మృతి చెందారు. సామ్రాజ్యం కుటుంబసభ్యులను పరామర్శించిన నరేంద్ర కుమార్ ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే చింతలపూడి గ్రామంలో ఇటీవల మృతిచెందిన శతాధిక వృద్ధురాలు ధూళిపాళ్ళ ఇందిరాదేవి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

50 ఏళ్ల తరువాత అపూర్వ కలయిక

బుర్రిపాలెంలో 1965లో చదువుకున్న మహిళా స్నేహితులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ మహిళా స్నేహితులు

తెనాలి రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రిపాలెంలో 50 సంవత్సరాల తరువాత పూర్వ మహిళా స్నేహితులు ఒక్కటయ్యారు. గ్రామంలోని కల్యాణ మండపంలో ఆదివారం పూర్వ స్నేహితుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. బుర్రిపాలెం గ్రామంలో పుట్టి పెరిగిన వీరు 1965 సంవత్సరంలో ఆరు, ఏడు తరగతులు చదివారు. ఆటపాటలతో సరదాగా గడిపిన రోజులతోపాటు స్కూల్, కాలేజ్ రోజుల్లో కలిసికట్టుగా ఉంటూ విద్యనభ్యసించిన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వివాహం అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ సమ్మేళనానికి హాజరై ఆటపాటలతో డ్యాన్స్‌లు చేసి ఆనందంగా గడిపారు. గ్రామంలో వారుచేసిన అల్లర్లు, ఆడిన ఆటలను తలచుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లతో పెద్దసంఖ్యలో పాల్గొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గడిచిన కాలాన్ని మననం చేసుకున్నారు. పెద్దసంఖ్యలో పూర్వ స్నేహితులు పాల్గొన్నారు.


వడ్లతో రామనామ జపం చేస్తున్న భక్తులు

వడ్లతో రామనామ జపం

తెనాలి రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడివాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ కోదండ రామాలయంలో భక్తులు వడ్లగింజలతో రామనామ జపాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అయోధ్యలో శ్రీ బాలరాముని ప్రతిష్ఠజరిగి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు రామనామంతో లెక్కించిన వడ్లను అంగలకుదురు దాసకూటి ఆశ్రమంలో ఈనెల 21,22,23 తేదీల్లో జరిగే రామనామజపహోమంలో వినియోగించనున్నట్లు వారు పేర్కొన్నారు.

రూ.10కోట్లకు చిట్టీ వ్యాపారి ఐపీ

పొన్నూరుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ప్రైవేటు చిట్టీలు నిర్వహిస్తున్న వ్యాపారి 10 కోట్ల రూపాయలకు ఐపీ పెట్టినట్లు సమాచారం. పట్టణంలోని తెలగపాలెం ప్రాంతానికి చెందిన సదరు వ్యాపారి కొన్నేళ్లుగా పొన్నూరు, పరిసర ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు, ప్రముఖ వ్యక్తుల వద్ద చిట్టీ పాటలు నిర్వహిస్తున్నాడు. పెద్ద ఎత్తున చిట్టీ నగదు వసూళ్లు చేసినట్లు సమాచారం. సదరు వ్యాపారి స్థానిక కోర్టులో ఐపీ దాఖలు చేయడంతో పట్టణంలోని చిట్టీలు కట్టిన వారు పెద్ద సంఖ్యలో ఆందోళన చెందుతున్నారు.

యువకుడిపై దాడి

తెనాలి, మారీసుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పినపాడు గేటు వద్ద జరుగుతున్న నిర్మాణ పనులలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన హరికృష్ణ పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున అదే ప్రాంతానికి చెందిన దాసరి చేతన్, దేవరపల్లి మణి, బాలాజి, గోపినాథ్‌లు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో రాత్రి సమయంలో చేతన్ అతని మిత్రులు అక్కడికి వచ్చి మా మీదే పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ హరికృష్ణపై దాడి చేసి గాయపర్చారు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుద్యోగ యువతను మోసగించిన ప్రభుత్వాలు

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య

పొన్నూరుటౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసగించాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్లను చైతన్య తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చైతన్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రెండు కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామని నమ్మబలికి బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించడంతోపాటు నిరుద్యోగ భృతి కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే యువతను మోసం చేశారని ఆరోపించారు. తక్షణమే పెండింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. యువత సమస్యలపై ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో చర్చించనున్నట్లు చెప్పారు. ఈ సభలకు యువత పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాల్సిందిగా చైతన్య విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు పరిశరాజు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, పునుగుపాటి మురళీకృష్ణ, నిమ్మకాలయ దుర్గా ప్రసాద్, చైతన్య రాజు, గణేష్, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అంబేద్కర్‌కి నివాళి

తెనాలి మారీసుపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రజకపేట సర్కిల్‌లో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్ కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తమ నోట జై భీం, జై అంబేద్కర్ అనే పదాలు తప్ప వేరే పదాలు పలకవని అన్నారు. అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేయాలని విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులను కోరారు. కార్యక్రమంలో అక్కిదాసు కిరణ్ కుమార్, కనపర్తి అనిల్, యాతాటి అనిల్, యనమద్రి శ్యామ్, పిల్లి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాచవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు

రహదారుల నిర్మాణంతో గ్రామాలకు నూతన రూపు

● రూ.3.35కోట్ల వ్యయంతో నిర్మాణం

● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పొన్నూరుటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నూతన రహదారుల నిర్మాణంతో గ్రామాలు నూతన రూపును సంతరించుకుంటున్నాయి. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ పాలకులు రహదారుల నిర్మాణంపై నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో రహదారులు పూర్తిగా ధ్వంసమై ప్రజలు రాకపోకలకు తీవ్ర అవస్థలను ఎదుర్కొన్నారు. ధ్వంసమైన రహదారుల్లో నిత్యం ప్రమాదాలు జరిగి ఎంతోమంది క్షతగాత్రులయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రహదారుల నిర్మాణంపై దృష్టి సారించింది. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. మరోవైపు గుంతలు లేని రహదారుల పేరుతో వాటి మరమ్మతులు చేపట్టడానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసింది. పొన్నూరు మండలంలో రూ.3.35కోట్ల వ్యయంతో రహదారులు, కల్వర్టుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభం కావడంతో ఐదేళ్లుగా నరకయాతన అనుభవించిన ప్రజలు నూతన రహదారుల్లో రాకపోకలు సాగిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొన్నూరు మండలంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున రహదారుల నిర్మాణం, మరమ్మతులు జరుగుతున్నాయి. పొన్నూరు నుంచి కాకుమాను వెళ్లే ప్రధాన రహదారిని రూ.40లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. నిడుబ్రోలు-గోవాడ రహదారికి రూ.46లక్షలతో మరమ్మతులు చేపడుతున్నారు. బ్రాహ్మణకోడూరు మీదుగా జూపూడి వెళ్లే రహదారిని రూ.8లక్షల వ్యయంతో, కట్టెంపూడి వెళ్లే రహదారిని రూ.28లక్షలు, జీబీసీ రోడ్డు నుంచి చింతలపూడి వెళ్లే రహదారిని రూ.40లక్షలతో మరమ్మతులు చేస్తున్నారు. అలాగే గుంటూరు-చీరాల ప్రధాన రహదారిని రూ.40లక్షలతో మరమ్మతులు, మాచవరం-అల్లూరు రోడ్డును 25 లక్షలతో నిర్మాణం, గుంటూరు-చీరాల రహదారికి రూ.20లక్షలు, పొన్నూరు నుంచి పాండ్రపాడు, వరగాని వెళ్లే రహదారికి రూ.5లక్షలు, నిడుబ్రోలు-ప్యాప్రు రహదారికి రూ.30లక్షలు, దండమూడి-ఆరెమండ రహదారికి రూ.28 లక్షలు, జీబీసీ రోడ్డు నుంచి చింతలపూడి మీదుగా పెదపాలెం, గోపాపురం వెళ్లే రహదారికి రూ. 13 లక్షలు, జీబీసీ రోడ్డు నుంచి జూపూడి వెళ్లే రహదారికి రూ.10 లక్షలు, పొన్నూరు - పాండ్రపాడు రహదారికి రూ.5లక్షలు, మండలంలో పలు కల్వర్టుల నిర్మాణానికి రూ.80లక్షలు మంజూరయ్యాయి. వీటిలో రహదారుల నిర్మాణం ఇప్పటికే పనులు ప్రారంభం కాగా మరికొన్ని రహదారుల నిర్మాణం ప్రారంభ దశలో ఉన్నాయి. రహదారుల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు, కూటమి ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

వాకర్స్ క్లబ్ 25వ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్ 25వ వార్షికోత్సవం ఆదివారం కవిరాజా పార్కులో నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, గుత్తా వెంకటరత్నం అధ్యక్షతన జరిగింది. క్లబ్ జిల్లా గవర్నర్ పెద్ది శివరామప్రసాద్ మాట్లాడుతూ, క్లబ్ లక్ష్యాలను, విధులను వివరించారు. ఉత్తమ వాకర్ మెడతాటి బాపూజీ, మహిళా వాకర్ ధనలక్ష్మి, యోగసాధకులు ఉషారాణి, హెల్పింగ్ సోల్జర్ ఇనయ్‌తుల్లాలను ఘనంగా సన్మానించారు. కడియాల రవిబాబు, రత్తయ్య, అశోక్‌కుమార్, నారాయణ, రంగారావు, ఉదయ్‌శంకర్, బొబ్బా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు నేత శివనాగేశ్వరరావు

తెనాలి అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): డి.శివనాగేశ్వరరావు ఆదర్శ కమ్యూనిస్టు నేతగా జీవితం గడిపారని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసీం పేర్కొన్నారు. పోస్టల్ సొసైటీ అధ్యక్షుడు, పోస్టల్ ఉద్యోగుల సంఘ నాయకుడు డీఎస్ఎన్ సంస్మరణ సభను ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. తిరుమలరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల సాధనకు నిరంతరం పోరాటం చేశారని చెప్పారు. గ్రామీణ తపాల ఉద్యోగుల ఐక్యవేదిక ప్రారంభించి ఉద్యమ నిర్మాణానికి కారకులయ్యారని, జీవితమంతా ఉద్యోగుల కోసం పని చేశారని చెప్పారు. తెలంగాణా విద్యావంతుల వేదిక కన్వీనర్ ఐ.కోటేశ్వరరావు, అంబటి నాగయ్య, శివాజీ, డేవిడ్ ప్రసంగించారు. కార్మిక సంఘ నాయకులు లక్ష్మీనారాయణ, బెన్‌హర్, రామారావు, కోటేశ్వరరావు, యోగేశ్వరరావు, సత్యనారాయణ పర్యవేక్షించారు.

శ్రోతలను అలరించిన త్యాగరాజ స్వామి కీర్తనలు

తెనాలి అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో త్యాగరాజ ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామికి, రాములవారికి ప్రత్యేక పూజలు చేశారు. సంకీర్తన బృందం, లక్ష్మీశారదా సంగీతాలయం, ఆంజనేయ శాస్త్రి బృందం పంచరత్న కీర్తనలు ఆలపించారు. ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీ కిరణ్‌కుమార్, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, మూర్తి అనూరాధ, ఎస్‌బీ శివ, బాలకృష్ణ, సురేష్, విద్యాసాగర్, మాజేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. సంకీర్తన బృందాలను ఈవో సత్కరించారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్

నూతన కార్యవర్గానికి అభినందనలు


అసోసియేషన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్లకు శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటపూర్ణచంద్, వెంకటేశ్వరరావు

తెనాలి రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి గుంటూరు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా తెనాలికి చెందిన నల్లూరి వెంకటేశ్వరరావులు ఎన్నికయ్యారు. వారిని గుంటూరు జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్, సీఈవో బత్తుల వెంకటేశ్వరరావులు కలిసి దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

తెనాలి రూరల్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కఠెవరంలో కోడి పందేలు ఆడుతున్నారని అందిన విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించినట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో పందెంరాయుళ్లు ముగ్గురు పట్టుబడగా వారి వద్ద రూ.1500, ఒక పందెంకోడిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.